జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

సంపుటి 4 సంచిక 161 | హైదరాబాద్, మార్చి 30 మంగళవారం 2021 | 8 పేజీలు | వెల : 5.00

మాస్టర్ కీ TV
(అంబేడ్కర్ TV) ఛానల్
బహుజన భావజాలంతో
అప్రతిహతంగా బహుజన మేధావులను సైతం అబ్బుర పరుస్తూ
తెలంగాణ మరియు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లో దూసుకుపోతున్న
MASTER KEY (AMBEDKAR TV) CHANNEL కు
మార్కెటింగ్ మేనేజర్ కావలెను
అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
ఆసక్తిగలవారు
ఈ క్రింది నెంబర్లల్లో సంప్రదించగలరు:
6300015804, 8886911944

# వరి ధాన్యం కొనుగోళ్లపై కేసీఆర్ కీలక నిర్ణయం



హైదరాబాద్,మార్చి 29, ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్రవ్యాప్తంగా యాసంగిలో వచ్చే వరి ధాన్యాన్ని గ్రామాల్లో 6,408 కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వమే పూర్తి స్థాయిలో కొనుగోలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు తెలిపారు. కరోనా మహమ్మారి మరోసారి విజృంభిస్తున్న నేపథ్యంలో రైతుల ప్రయోజనాల దృష్ట్యా గత ఏడాదిలాగే గ్రామాల్లో వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు సీఎం స్పష్టం చేశారు. ఇవాళ ప్రగతి భవన్ లో వ్యవసాయ, మార్కెటింగ్, పౌర సరఫరాల శాఖలపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, పౌరసరఫరాల కార్పొరేషన్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ నర్సింగ్ రావు, సెక్రటరీ భూపాల్ రెడ్డి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి జనార్దన్ రెడ్డి, పౌర సరఫరాల కమిషనర్ అనిల్ కుమార్, ఎఫ్.సి.ఐ జనరల్ మేనేజర్ అశ్వినీ గుప్తా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలుకు అవసరమైన 20,000 కోట్ల రూపాయలకు బ్యాంకు గ్యారంటీ ఇచ్చే ఏర్పాట్లను మంగళవారం సాయంత్రానికల్లా పూర్తి చేయాలని ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావును ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల తక్షణ ఏర్పాటు కోసం అన్ని జిల్లాల కలెక్టర్లతో అత్యవసర వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ ను ఆదేశించారు. హైదరాబాద్ లోనే ఉండి కొనుగోలు కేంద్రాల ఏర్పాటును, ధాన్యం కొనుగోళ్లను నిరంతరం పర్యవేక్షించాలని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డికి సీఎం సూచించారు. వ్యవసాయ, మార్కెటింగ్, పౌరసరఫరాల శాఖలను సమన్వయం చేసుకుంటూ ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రిని, సీఎస్ ను, అధికారులను సీఎం ఆదేశించారు. మొత్తం 6,408 కొనుగోలు కేంద్రాల్లో 2,131 ఐకేపీ కేంద్రాలు, 3,964 పీ.ఏ.సీ.ఎస్. కేంద్రాలు, మిగతావి మరో 313 కేంద్రాలున్నాయని పేర్కొన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చే విషయంలో కనీస మద్దతు ధర నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ముఖ్యమంత్రి కోరారు. వడ్లు ఎండబోసి తాలు లేకుండా 17శాతం తేమకు మించకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని అన్నారు. తేమ ఎక్కువగా లేకుండా చూసుకోవాలని, కనీస మద్దతు ధర పొందేందుకు అనుసరించాల్సిన నిబంధనలను పాటించాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు అవసరమైన 20 కోట్ల గన్నీ బ్యాగులను సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో పండే పత్తికి అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నదని, పత్తి మంచి క్వాలిటీ ఉండటంతోపాటు ఎక్కువ దిగుబడి వచ్చి అధిక ధర లభించే అవకాశం ఉన్నందున, వచ్చే వానాకాలం 75 నుండి 80 లక్షల ఎకరాల్లో పత్తి పండించడానికి సిద్ధం కావాలని సీఎం రైతులను కోరారు. ఇందుకు అవసరమైన విత్తనాల కోసం ఇప్పటినుంచే ఏర్పాట్లు చేయాలని సీఎం వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జనార్ధన్ రెడ్డిని ఆదేశించారు. అలాగే, 20 నుండి 25 లక్షల ఎకరాల్లో కందిపంట సాగు కోసం చర్యలు చేపట్టాలని సూచించారు. పత్తి, కంది పంటలకు నీళ్ల తడులు పెడితే దిగుబడి ఎక్కువ వస్తుందని సీఎం తెలిపారు. ఈ యాసంగిలో 52.76 లక్షల ఎకరాల్లో వరి పంట పండిందని, దాదాపు 1 కోటి 17 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం, 21 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని సీఎం వివరించారు. ఆహార ధాన్యాల నిల్వల కోసం అదనపు గోదాములను నిర్మించేందుకు సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ సిద్ధంగా ఉన్నందున కార్పొరేషన్ కు లీజుకు ఇవ్వడానికి స్థలాలను ఎంపిక చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం ఆదేశించారు.



## అయోమయంలో బీజేపీ..

### సాగర్ అభ్యర్థి ఎంపికపై మల్లగుల్లాలు!

నల్గొండ,మార్చి 29, ప్రజాపాలన ప్రతినిధి: నాగార్జున సాగర్ ఉప ఎన్నిక బీజేపీ అభ్యర్థి ఎవరనేది ఇంకా తేలలేదు. టీఆర్ఎస్ అసంతృప్తులు వస్తారని బీజేపీ భావించింది. తేరా చిన్నపురెడ్డి, కోటిరెడ్డికి టీఆర్ఎస్ తరపున టికెట్ రాకపోతే కాషాయ కండువా కప్పుకుంటారని బీజేపీ నేతలు అంచనా వేశారు. ఈ ఇద్దరికీ టీఆర్ఎస్ బాస్ హామీ ఇచ్చి బుజ్జగించారు. దీంతో వాళ్లు బీజేపీలో చేరేందుకు వెనక్కి తగ్గారు. అయితే కొంతమంది పేర్లను హైకమాండ్‌కు పంపామని బీజేపీ నేతలు అంటున్నారు. ఆశావహులు ఇప్పటికే సాగర్‌లో ప్రచారం ప్రారంభించేశారు. కానీ వీరికి బీజేపీ అధిష్టానం నుంచి ఎటువంటి సంకేతాలు రాలేదు. దీంతో అభ్యర్థి ఎంపికపై మల్లగుల్లాలు పడుతున్నారు. ఇక రాష్ట్ర పార్టీ పంపిన జాబితాను అధిష్టానం పరిశీలించి బలమైన నాయకుడిని సాగర్ బరిలో దింపుతుందని బీజేపీ నేతలు చెబుతున్నారు.



### పూలే, అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో..
### సికింద్రాబాద్, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాల

## జోనల్ నిర్మాణ సదస్సు



హైదరాబాద్(ప్రజాపాలన ప్రతినిధి): పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో సికింద్రాబాద్, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజక వర్గాల జోనల్ నిర్మాణ సదస్సు సికింద్రాబాద్ వైఎంసీఏ లో జరిగింది. బహుజన రాజ్యమే లక్ష్యంగా రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రతీ జోనల్, మండల్,గ్రామ స్థాయిలో నిర్మాణ సదస్సు లను నిర్వహించి బహుజనులకు కమిటీలు నియామకం చేయడం ద్వారా బహుజన రాజ్యాధికారం కొరకు ఉద్యమ నిర్మాణానికై పూనుకొన్న పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఈ కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్ వైఎంసీఏ లో నిర్వహించిన

(మిగతా 3వ పేజీలో..)

## నాగార్జున సాగర్ టీఆర్ఎస్ అభ్యర్థిగా నోముల భగత్

### టీఆర్ఎస్ అభ్యర్థిగా బీ ఫామ్ అందుకున్న నోముల భగత్



హైదరాబాద్,మార్చి 29, ప్రజాపాలన ప్రతినిధి: నాగార్జునసాగర్ ఉప ఎన్నికలో టీఆర్ఎస్ అభ్యర్థిగా నోముల భగత్‌ను సీఎం కేసీఆర్ ప్రకటించారు. భగత్‌కు కేసీఆర్ బీ ఫామ్ ఇచ్చారు. సోమవారం ఉదయం భగత్ నామినేషన్ వేస్తారు. ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ దిగ్గజం జానారెడ్డిని ఢీకొట్టేందుకు సరైన అభ్యర్థి కోసం చివరిదాకా సర్వేలపై సర్వేలు చేసిన సీఎం కేసీఆర్.. దివంగత ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య తనయుడు భగత్‌కే టికెట్ ఇవ్వాలని నిర్ణయించారు. దుబ్బాక, గ్రేటర్ హైదరాబాద్‌లో జరిగిన నష్టాన్ని పట్టభద్రుల ఎన్నికల్లో పూడ్చుకున్నామని.. నాగార్జునసాగర్ ఉప ఎన్నికలో భారీ మెజారిటీ సాధించి ఇక తిరుగులేదని నిరూపించుకోవాలని.. అధికార టీఆర్ఎస్ భావిస్తోంది. దీంతో సాగర్ ఉప ఎన్నికకు సంబంధించిన ప్రతి అంశాన్నీ కేసీఆర్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలోనే అభ్యర్థి ఎవరనేది మంత్రులకు, ఎమ్మెల్యేలకు సైతం తెలియకుండా చివరిదాకా సీఎం గోప్యత పాటించారు. కాగా.. పార్టీ తరఫున అభ్యర్థి ఖరారు కాకముందే.. ప్రచార బాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్యేలు స్థానికంగా తీవ్రస్థాయిలో పనిచేస్తున్నారు.

## అనాథల విద్యాజ్యోతి.. ఒబామా నాయనమ్మ కన్నుమూత



నైరోబీ,మార్చి 29, ప్రజాపాలన ప్రతినిధి:అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా చిన్నాయనమ్మ, అనాథల జీవితాల్లో అక్షర జ్యోతులు వెలిగించిన మామా సారా కన్నుమూశారు. 99 ఏళ్ల వయస్సులో సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు తుదిశ్వాస విడిచినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. కెన్యాలోని కిసుములో ఉన్న జరమోగి ఒడింగా ఒడింగా టీచింగ్ అండ్ రిఫరల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఆమె చనిపోయారు. ఒబామా తండ్రికి పినతల్లి అయిన సారా.. సంఘసేవకురాలిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అనాథలు, బాలికలకు విద్యను అందించడానికి ఆమె ఎంతగానో కృషి చేశారు. ఒబామా తండ్రి సీనియర్ ఒబామాను స్కూల్‌కు తీసుకు వెళ్లడానికి రోజూ తొమ్మిది కిలోమీటర్లు సైకిలు తొక్కేవారట. తమ గ్రామం కోగెలో నుంచి ఎన్జియా నగరానికి ఆయన్ను తీసుకు వెళ్లి చదువు చెప్పించేవారట. ఒబామా తను రాసిన 'డ్రీమ్స్ ఫ్రమ్ మై ఫాదర్' పుస్తకంలో ఆమె గురించి ప్రస్తావించారు. 1988లో తొలిసారి కలుసుకన్నట్టు రాశారు. ఒబామా అధ్యక్షుడిగా తొలిసారి ప్రమాణం స్వీకారం చేసినప్పుడు ఆమె హాజరయ్యారు.

(మిగతా 2వ పేజీలో..)

## భారత్‌లో త్వరలో మూడో వ్యాక్సిన్‌కు ఆమోదం : డాక్టర్ రెడ్డీస్




న్యూఢిల్లీ,మార్చి 29, ప్రజాపాలన ప్రతినిధి: రష్యాకు చెందిన కొవిడ్-19 వ్యాక్సిన్ స్పుత్నిక్ వీ రానున్న కొద్ది రోజుల్లో ఇండియన్ రెగ్యులేటర్ నుంచి అనుమతి పొందనున్నదని డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ ఆశిస్తున్నది. 'భారతదేశంలో టీకా ప్రయాణం.. కొవిడ్ -19 సెకండ్ వేవ్' పై తెలంగాణలోని ఆలిండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ (ఏఐపీసీ) వెబ్‌నార్ నిర్వహించింది. ఈ వెబ్‌నార్‌లో పాల్గొన్న డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ సీఈఓ దీపక్ సప్రా మాట్లాడుతూ.. 'రాబోయే కొద్ది రోజుల్లోనే స్పుత్నిక్ వీ వ్యాక్సిన్ ఆమోదం పొందుతుందని భావిస్తున్నాం. ఇది రెండు-మోతాదుల వ్యాక్సిన్. మొదటి మోతాదు తీసుకున్న 21 వ రోజు తర్వాత రెండో డోసు తీసుకుంటారు.

(మిగతా 2వ పేజీలో..)

పూలే - అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (PARS)
అంబేడ్కర్ రాజనీతి మూవ్‌మెంట్ (ARM)
(An Unit of JAC Regn. No. 1047 of 2016)
Central Office: # 6-2-29/3/12, 3rd Floor, Doublet Plaza, Lakdi-Ka-Pool, Hyderabad - 500 004
https://ambedkarrajaneethi.com E-mail : ambedkarrajaneethimovement@gmail.com
ఆత్మ గౌరవ పరిరక్షణే మన లక్ష్యం - రండి కదలిరండి
బహుజన మిత్రులారా !
జై భీమ్
భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 74 సంవత్సరాలు అయినప్పటికీ 85% బహుజనుల సమస్యలు సమస్యలుగానే ఉంటున్నాయి.
అత్యధిక జనాభా కలిగి ఉన్న బహుజనులు కూడా, బహుజన సమస్యలను మెమోరాండం ద్వారానే ప్రభుత్వాలను అడుక్కుంటున్నాం. సమస్యలు అర్థం కాని అల్పసంఖ్యాకులు ఈ దేశాన్ని ఏలుతున్నారు. మన దేశాభివృద్ధి జరగాలంటే సమస్యలకు పరిష్కారం తెలిసిన బహుజనులు, పూలే పోరాట పటిమతో బాబాసాహెబ్ డా॥ అంబేడ్కర్‌గారు రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులతో ఒకరి సమస్యను ఒకరు సమర్థించు కుంటూ చేయి చేయి కలిపి సాధిద్దాం. బహుజన కులాల మధ్య అంతరాలను తొలిగించి సఖ్యత్వాలను పెంపొందిస్తూ బహుజనుల ఆత్మ గౌరవాన్ని కాపాడుకొందాం.
పూలే - అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (PARS) ఆశయాలలో ఏ ఒక్కటి నచ్చినా www.ambedkarrajaneethi.com వెబ్‌సైట్ ద్వారా మీ కుటుంబ సభ్యులందరు మెంబర్స్‌గా చేరండి. సమ సమాజ స్థాపనకు ఈ సామాజిక ఉద్యమంలో లక్షలాది మంది మెంబర్స్‌గా చేరడం వల్ల మన సమస్యలను మనమే సాధించుకోవడమే కాకుండా బహుజన రాజ్యాధికారం వైపు నడిపించగలము.
కనీసం ఏడు (7) కులాల నుండి 21 మంది ప్రతినిధులతో ప్రతి కమిటీ నిర్మాణం జరుగును.
తెలంగాణ రాష్ట్ర, జోనల్, పార్లమెంట్, అసెంబ్లీ, మండల స్థాయి కమిటీలలో చేరాలని ఆసక్తి ఉన్నవారు
సంప్రదించగలరు.
తెలంగాణ రాష్ట్ర కమిటీ
రాష్ట్ర కన్వీనర్ : డాక్టర్ ఆదికొండ వెంకట రాజయ్య సెల్ 9949012535, 9494512535
అడిషనల్ కన్వీనర్ : అరెపల్లి రాజేందర్ సెల్ : 9440918371
కోశాధికారి : డి. గోవర్ధన్ సెల్ : 9963300551
కో-కన్వీనర్స్
రుంజ ప్రేమ్ కుమార్ సెల్ : 9494447580
పెండ్యాల అనంతయ్య సెల్ : 9849361492
కె. అశోక్ కుమార్ సెల్ : 7207897749
ఉప్పు సత్యనారాయణ సెల్ : 8888300704
మల్లెల రామనాథం సెల్ : 9346939481
డాక్టర్ గుండు కిష్టయ్య ముదిరాజ్ సెల్ : 9948335870
Central Working Committee Members :
జై భీమ్ జై పూలే జై భారత్

# ఎపిహెచ్‌బీకాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా ప్రభాకర్‌గౌడ్

కుత్బుల్లాపూర్, మార్చి 29, ప్రజాపాలన ప్రతినిధి: రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఎపిహెచ్‌బీకాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం రాత్రి జరిగాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 373 ఓటర్లు ఉండగా 337 ఓట్లు పోలయ్యాయాని అధికారులు తెలిపారు. ఈ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి పోటీ చేసిన గిరగోని ప్రభాకర్‌గౌడ్‌కు 180 ఓట్లు రాగా తన ప్రత్యర్థి రాజవర్ధన్‌రెడ్డి154 ఓట్లు వచ్చాయి. ప్రభాకర్‌గౌడ్ తన ప్రత్యర్థి రాజవర్ధన్‌రెడ్డిపై 26 ఓట్ల మేజార్టీతో గెలుపోందారు. ప్రధాన కార్యదర్శిగా జి.ఎం.జయరావు, కోశాధికారిగా షేక్ శ్రీనుభాషాలు విజయం సాధించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ కాలనీ వాసులు తమపై నమ్మకంతో గెలిపించినందుకు కాలనీ వాసులకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీలోని సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్, కార్పొరేటర్ బి.విజయ్‌శేఖర్‌గౌడ్‌ల సహకారంతో కాలనీని అన్ని విధాలా అభివృద్ధి పరుస్తానన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను కాలనీ వాసులు శాలువాతో సన్మానించారు.



## భారత్‌లో త్వరలో మూడో వ్యాక్సిన్‌కు ఆమోదం : డాక్టర్ రెడ్డీస్

(మొదటి పేజీ తరువాయి)

గరిష్ట రోగనిరోధక శక్తి 28 వ రోజు నుంచి 42 వ రోజు మధ్య అభివృద్ధి చెందుతుంది. రానున్న కొన్ని రోజుల్లోనే అనుమతి లభిస్తుందనుకుంటున్నాం' అని చెప్పారు.ఫార్మా మేజర్ అయిన డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్.. రష్యా డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఆర్‌డీఐఎఫ్) తో కలిసి స్పుత్నిక్ వీ వ్యాక్సిన్‌ను తీసుకువచ్చింది. టీకా పరీక్షలు రష్యా, భారతదేశం, యూఏఈ, ఇతర దేశాలలో జరిగాయి. ఈ కొవిడ్ -19 వ్యాక్సిన్ 91.6 శాతం సామర్థ్యాన్ని ప్రదర్శించిందని లాన్సెట్ జర్నల్ తెలిపింది. ట్రయల్స్ డాటా ప్రస్తుతం ఇండియన్ రెగ్యులేటర్ వద్ద ఉన్నది. రాబోయే కొద్ది వారాల్లో దీనికి ఆమోదం లభించే అవకాశాలు ఉన్నాయని సంస్థ భావిస్తున్నది.'భారతదేశంలో కూడా టీకా పరీక్షలు నిర్వహించాం. భారతీయ జనాభాపై టీకా భద్రతతో పాటు ఇమ్యునోజెనిసిటీ కోసం కూడా పరిశీలించాం. ఈ డాటా ప్రస్తుతం భారత రెగ్యులేటర్ వద్ద ఉన్నది. త్వరలోనే ఈ వ్యాక్సిన్ ఆమోదించబడుతుంది' అని దీపక్ సప్రా చెప్పారు.కాగా, స్పుత్నిక్ వీ వ్యాక్సిన్ అన్ని వయసుల వారికి సమానంగా ప్రభావవంతంగా నిరూపించబడిందని వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసిన గమలేయ పరిశోధనా సంస్థ అధిపతి అలెగ్జాండర్ గింట్స్‌బర్గ్ వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిన నాలుగు నుంచి ఆరు వ్యాక్సిన్లలో స్పుత్నిక్ వీ లక్షణాల పరంగా మొదటి స్థానంలో ఉన్నదని గింట్స్‌బర్గ్ పేర్కొన్నారు.

## అనాథల విద్యాజ్యోతి.. ఒబామా నాయనమ్మ కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

ఆ తర్వాత 2014లో ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించిన సమయంలోనూ ఆమె హాజరయ్యారు. చదువంటే తనకు ప్రాణమని చెప్పిన ఆమె.. ఒక మహిళ చదువుకుంటే ఆమె కుటుంబం మాత్రమే చదువుకున్నట్టు కాదని, యావత్ గ్రామం చదువుకున్నట్టని చెప్పేవారు. ఎవరైతే విద్యావకాశాలు లేకుండా ఇబ్బందులు పడుతున్నారో.. వాళ్లు చదువుకోవడానికి అవకాశం కల్పించాలని చెప్పేవారు. ఆమె మృతికి కిసుము గవర్నర్ అన్యాంగ్ న్యోంగో సంతాపం తెలిపారు.

## మాస్క్ లేకుంటే రూ. 2వేలు ఫైన్




హైదరాబాద్,మార్చి 29, ప్రజాపాలన ప్రతినిధి : గ్రేటర్ హైదరాబాద్‌లో కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో మాస్కులు తప్పనిసరి చేస్తూ జీహెచ్‌ఎంసీ నిర్ణయం తీసుకుంది. ఫతేనగర్‌లో మాస్క్ లేకుండా కస్టమర్స్‌ను షాపులోకి అనుమతించిన ఓ షాపు యజమానికి 2 వేల జరిమానా విధించారు. రాష్ట్రంలో కరోనా కేసుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. కేసుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించిన విషయం తెలిసిందే. మరింత పకడ్బందీగా కొవిడ్ నిబంధనల అమలులో భాగంగా.. మాస్క్ ధరించడాన్ని తప్పనిసరి చేసింది. బహిరంగ ప్రదేశాలు, పని ప్రాంతాలు, ప్రజా రవాణా వాహనాల్లో ప్రతి ఒక్కరూ మాస్కు ధరించడాన్ని తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మాస్క్ ధరించని వారిపై విపత్తు నిర్వహణ చట్టం-2005లోని 51 నుంచి 60 సెక్షన్లతో పాటు ఐపీసీ 188 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఆ చట్టాల ప్రకారం రూ.1000 జరిమానాతో పాటు ఆరునెలల జైలు శిక్ష విధించే అధికారం ఉంది. ఇక హెూలీ వేడుకలను బహిరంగంగా జరుపుకోవడాన్ని కూడా సర్కారు నిషేధించింది. దీనితో పాటు షబ్-ఏ-బరాత్, ఉగాది, శ్రీరామనవమి, మహవీర్ జయంతి, గుడ్ ఫ్రైడే, రంజాన్, తదితర పండుగల వేడుకలపైనా ఏప్రిల్ 30 వరకు ఆంక్షలు విధించింది.

## కోవిడ్ వ్యాక్సిన్ వేయించుకున్న కవిత



హైదరాబాద్,మార్చి 29 (ప్రజాపాలన ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్రంలో కరోనా సెకండ్ వేవ్ కేసులు వేగంగా పెరుతున్నాయి. రోజు రోజుకు యాక్టివ్ కేసుల సంఖ్య పెరుగుతోంది. దీంతో ప్రజా ప్రతినిధులు కోవిడ్ వ్యాక్సిన్ తీసుకుంటున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె, టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత కరోనా వ్యాక్సిన్ తీసుకున్నారు. సోమవారం నిమ్స్ ఆస్పత్రిలో ఆమె కోవిడ్ ఫస్ట్ డోస్ వ్యాక్సిన్ వేయించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. వ్యాక్సిన్ తీసుకోవడంలో ఎలాంటి అపోహలు వద్దని, ప్రజలు భయపడకుండా కరోనా వ్యాక్సిన్ తీసుకోవాలని కవిత సూచించారు. నిమ్స్‌లో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆయన సతీమణి నీరజారెడ్డి కోవిడ్ వ్యాక్సిన్ తీసుకున్నారు. అనంతరం ప్రశాంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కరోనా వైరస్‌ను ఎదుర్కోవడానికి ప్రతి ఒక్కరూ కోవిడ్ వ్యాక్సిన్ తీసుకోవాలని, ప్రజలకు వ్యాక్సిన్ పట్ల అపోహలు అవసరం లేదన్నారు. వ్యాక్సిన్ తీసుకోవడం వలన ఎలాంటి ప్రమాదం ఉండదని ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

# 40వ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా ముటాపురంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ





పాలేరు, మార్చి 29, ప్రజాపాలన ప్రతినిధి:నేలకొండపల్లి మండలం మోటాపురం గ్రామం లో దివంగత తెలుగు తేజం తెలుగుదేశం. తెలుగుదేశం 40 వ వార్షికోత్సవం సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఆవిష్కరించిన టిడిపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్రీమతి నందమూరి సుహాసిని విగ్రహం ఆవిష్కరణ చేయడం జరిగింది అనంతరం సుహాసిని మాట్లాడుతూ ఎక్కడ ఉంది తెలుగుదేశం పార్టీ అన్నవల్లకు ఎప్పుడు చూడండి తెలుగుదేశం రాబోయే కాలంలో అధికారంలోకి వచ్చేది తెలుగుదేశం పార్టీని తెలియజేశారు కార్యక్రమంలోరాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం, మాజీ ఎమ్మెల్యే సీత దయాకర్ రెడ్డి, నేలకొండపల్లి అధ్యక్ష కార్యదర్శులు అరేకొట్ల కొండలరావు, ఎన్ మల్లయ్య, కూసుమంచి తెలుగు దేశం పార్టీ కార్యదర్శి మందపల్లి కోటేశ్వరరావు,పాల్గొన్నారు.

# నోముల భరత్ కు టికెట్..

## కేసీఆర్ కు కృతజ్ఞతలు తెలిపిన భేరి



శేరిలింగంపల్లి, ప్రజాపాలన ప్రతినిధి : నాగార్జునసాగర్ ఉప ఎన్నికల నేపథ్యంలో టిఆర్ఎస్ అభ్యర్థి ఎంతో మంది పోటీలో ఉన్నా గాని ముఖ్యమంత్రి కేసీఆర్ నోముల కుటుంబానికి పెద్దపీట వేశారని రాష్ట్ర బీసీ సంఘం ఉపాధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ నాగార్జున సాగర్ అసెంబ్లీ ఉప ఎన్నికలో తెరాస నుంచి బరిలోకి దిగే అభ్యర్థి ఎవరనే అంశంపై ఉత్కంఠకు తెరపడింది. తమ పార్టీ అభ్యర్థిగా దివంగత ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య కుమారుడు నోముల భగత్ పేరును ఖరారు చేసినట్లు తెరాస అధినేత, తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రకటించారు. అనంతరం భగత్‌కు బి-ఫారం ఇవ్వడంతోపాటు ఎన్నికల ప్రచారం కోసం రూ.28లక్షల చెక్కును అందజేశారు. రేపు ఉదయం తెరాస ఎమ్మెల్యే అభ్యర్థిగా భగత్ నామినేషన్ వేయనున్నారు. నాగార్జున సాగర్ నియోజక వర్గం ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య అనారోగ్యంతో గతేడాది కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆయన మృతితో ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో నోముల నర్సింహయ్య అందించిన సేవలకు గుర్తింపుగా.. పార్టీ వర్గాల అభిప్రాయాల మేరకు ఆయన కుమారుడైన నోముల భగత్‌ను తెరాస అభ్యర్థిగా నిలబెట్టారు. నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రజలు నోముల భరత్ ను ఆశీర్వదించి అఖండ మెజారిటీతో గెలిపించాలని బేరి రామచందర్ యాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి నడికుడి రఘునాథ్ యాదవ్, శంషాబాద్ నగేష్ యాదవ్, రాజు యాదవ్, దొంతి బోయిన శ్రీనివాస్ యాదవ్, అందెల సత్యనారాయణ యాదవ్, రవి యాదవ్, బాలరాజు యాదవ్, అశోక్ యాదవ్, యాదగిరి యాదవ్ ముఖ్యమంత్రి కేసీఆర్ కు శుభాకాంక్షలు తెలిపారు.

# వాహనదారులకు గుడ్‌న్యూస్..

## ధ్రువపత్రాల చెల్లుబాటు గడువు మరోమారు పెంపు



న్యూఢిల్లీ,మార్చి 29 (ప్రజాపాలన ప్రతినిధి) : వాహనదారులకు ఇది నిజంగా శుభవార్తే. వాహన ధ్రువీకరణ పత్రాల చెల్లుబాటును ఈ ఏడాది జూన్ వరకు పెంచుతున్నట్టు రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలకు తెలిపింది. మోటార్ వెహికిల్స్ చట్టం 1988, సెంట్రల్ మోటార్ వెహికిల్ రూల్స్ 1989 ప్రకారం అవసరమైన పత్రాల చెల్లుబాటు గడువును పొడిగించినట్టు పేర్కొంది. ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్‌తోపాటు ఇతర ధ్రువీకరణ ప్రతాలకు ఇది వర్తిస్తుంది. వీటి కాలపరిమితి ముగిసినప్పటికీ లాక్‌డౌన్ కారణంగా వాహనదారులు రెన్యువల్ చేయించుకోలేక పోయారు. ఫిబ్రవరి 1, 2020 నుంచి మార్చి 31, 2021 మధ్య చెల్లుబాటు గడువు ముగిసిన వాటికి ఇది వర్తిస్తుంది. ఫిబ్రవరి 1 తర్వాత గడువు ముగిసిన పత్రాలు జూన్ 30, 2021 వరకు చెల్లుబాటులో ఉన్నట్టుగానే పరిగణించాలని రవాణా మంత్రిత్వ శాఖ రాష్ట్రాలకు సూచించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కూడా ఈ విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని పేర్కొంది. నిజానికి ఇది వరకు పొడిగించిన గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది. కరోనా లాక్‌డౌన్ నేపథ్యంలో వాహన ధ్రువీకరణ పత్రాల చెల్లుబాటు కాలన్ని తొలుత గతేడాది జూన్ 9 వరకు పెంచింది. ఆ తరువాత ఆ గడువు ఆగస్టు 9కి, అనంతరం డిసెంబరు 27 వరకు పొడిగించింది. ఆ తర్వాత ఫిబ్రవరి 1, 2021 వరకు పెంచిన ప్రభుత్వం అనంతరం మార్చి 31 పెంచింది. తాజాగా, ఇప్పుడు జూన్ వరకు పెంచుతున్నట్టు ప్రకటించి వినియోగదారులకు ఊరటనిచ్చింది.



## ప్రజా సంక్షేమం తెలుగుదేశం తోనే.. కడారి ఐలయ్య

నెల్లికుదురు మార్చి 29( ప్రజా పాలన )తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించినప్పటి నుంచి ప్రజల్లో రాజకీయ చైతన్యం వెల్లివిరిసిందని ఆ పార్టీ దళిత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడారి ఐలయ్య అన్నారు. టిడిపి39వ, ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంలో సోమవారం పార్టీ జెండానుఆయన పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో నందమూరి తారక రామారావు1983లో టిడిపిని స్థాపించిమండలాలను స్థాపించి రాజకీయ వికేంద్రీకరణకు పాల్పడ్డారన్నారు. పేదలకు రూ. 2కిలో బియ్యం అందించాలని భూమిశిస్తు రద్దు చేశారని కరెంట్ బిల్లు పూర్తిగా తగ్గించారన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల నాయకులు బొల్లు ముత్తయ్య,భూక్యసోమన్న రాజేష్ బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఎగరవేసిన ఎమ్మెల్యే మెచ్చా

అశ్వరావుపేట మార్చి 29, ప్రజాపాలన ప్రతినిధిః తెలుగుదేశం పార్టీ 39 సంవత్సరాలు పూర్తి చేసుకుని 40 వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈరోజు అశ్వరావుపేట రింగ్ రోడ్డు నందు ఎన్టీఆర్ విగ్రహం కు పూలమాలలు వేసి జెండా ఆవిష్కరణ చేసిన అశ్వారావుపేట శాసనసభ్యులు శ్రీ మెచ్చా నాగేశ్వరరావు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షు లు ఎం రాజమోహన్ రెడ్డి , రాష్ట్ర తెలుగుదేశం కార్యదర్శి కె స్వామి దొర ,పేరాయి గూడెం సర్పంచ్ నార్లపాటి సుమతి , చిట్టిబాబు, రాంబాబు, బ్రహ్మరావు,పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హఠాత్తుగా షార్ట్ సర్క్యూట్



బాలాపూర్, మార్చి 29, ప్రజాపాలన ప్రతినిధి: బాలాపూర్ మండలం మీర్ పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 33వ డివిజన్ లో లెనిన్ నగర్ (బస్ స్టాప్) ప్రైమరీ స్కూల్ పహరి గోడ పక్కన ఉన్న ట్రాన్స్ ఫారం షార్ట్ సర్క్యూట్ ఏర్పడి దాదాపు 20 నిమిషాలు వైర్లు పూర్తిగా అగ్నికి ఆహుతి అవుతుంటే అక్కడున్న ప్రజలందరూ హెూలీ పండుగ లో నిమగ్నమై ఉన్న సందర్భంలో ఒకేసారి శబ్దం తో మంటలు రావడంతో భయ భ్రాంతులు చెందారు. స్థానికులు మట్టి పోసి తర్వాత నీళ్ళు తో మంటలను ఆర్పడం జరిగింది. మీర్ పేట పోలీస్ స్టేషన్ కు విషయం తెలిసిన వెంటనే డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్స్ వచ్చి అందరికీ ధైర్యం చెప్పారు.

## ఎర్రోజు బిక్షపతి చారిని సత్కరించిన కంజర్ల కృష్ణమూర్తి చారి



శేరిలింగంపల్లి, మార్చి 29, ప్రజాపాలన ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం ఎన్నికల్లో అత్యధిక ఓట్లు సాధించి 17,123 ఓట్ల మెజారిటీతో రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన ఎర్రోజు బిక్షపతి చారిని శ్రీ శ్రీ మహంకాళి విశ్వకర్మ సంఘం రామచంద్రాపురం, విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం - పటాన్చెరు నియోజకవర్గం అధ్యక్షులు కంజర్ల కృష్ణమూర్తి చారి కలిసి ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు అశోక్ చారి, పటాన్చెరు నియోజకవర్గం ఉపాధ్యక్షులు కృష్ణ చారి, బ్రహ్మచారి, శ్రీనివాస్ చారి, రాజేందర్ చారి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా టీడీపీ 40వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

మేడిపల్లి, మార్చి 29 (ప్రజాపాలన ప్రతినిధి) : తెలుగుదేశం పార్టీ 40వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను చిలుకానగర్ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పబ్బతి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు డివిజన్లోని బీరప్పగడ్డలో డివిజన్ ఇంచార్జీ కోళ రవి కుమార్ గౌడ్ మరియు టీడీపీ నాయకులతో కలిసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జెండా ఆవిష్కరణ చేశారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు బజారు హేమంత్ గౌడ్, ఉప్పల్ డివిజన్ అధ్యక్షులు తిక్క ప్రకాష్, సీనియర్ నాయకులు కళ్లురి వెను, ఓబయ్య, పాండు, అశోక్ గౌడ్, సాయి కిరణ్ మరియు తెలుగుదేశం పార్టీ ముఖ్య కార్యకర్తలు తదితరుల్లు పాల్గొన్నారు.



## నాగార్జునసాగర్ బైపోల్.. మండలాలకు టీఆర్ఎస్ ఇంచార్జీలు వీరే




నల్గొండ,మార్చి 29, ప్రజాపాలన ప్రతినిధి: నాగార్జునసాగర్ అసెంబ్లీ స్థానానికి జరిగే ఉప ఎన్నికల్లో ప్రచారం కోసం టీఆర్ఎస్ నాయకత్వం మండలాలవారీగా ఇంచార్జీలను నియమించింది. ఈ ఏడాది ఏప్రిల్ 17న ఈ స్థానానికి ఉప ఎన్నికలు జరగనున్నాయి. దివంగత ఎమ్మెల్యే నోముల నర్సింహ్మయ్య తనయుడు భగత్ ను టీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలోకి దింపాలని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకొన్నారు. తిరుమలగిరి సాగర్‌కు రమావత్ రవీంద్రకుమార్ (దేవరకొండ ఎమ్మెల్యే),, హాలియా పట్టణానికి కోరకంటి చందర్ (రామగుండం ఎమ్మెల్యే),పెద్దవూరకు...

### పూలే, అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో.. సికింద్రాబాద్, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాల

# జోనల్ నిర్మాణ సదస్సు

(మొదటి పేజీ తరువాయి)

సదస్సులో పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ కటికల శివ భాగ్యారావు, రాష్ట్ర వర్కింగ్ కన్వీనర్ ఆరేపల్లి రాజేందర్, అంబేద్కర్ రాజనీతి మూవ్ మెంట్ కేంద్ర సభ్యులు నేరేళ్ల కోటేశ్వరరావు, దూలపల్లి వాణి, రాష్ట్ర కన్వీనర్ ఉప్పు సత్యనారాయణ,సికింద్రాబాద్, మల్కాజిగిరి జోనల్ కమిటీ కన్వీనర్ డాక్టర్ పిల్లోడి.లక్ష్మయ్య,కోకన్వీనర్ కె.రేణుక,రాష్ట్ర ఆర్ టి సి బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు,సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ పన్యాల మమతా గౌడ్,సావిత్రిబాయి పూలే ఫౌండేషన్ చైర్మన్,సామాజిక వేత్త ఎం.రజిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ, రాష్ట్ర కన్వీనర్ లు బహుజన ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు బహుజన నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నియమితులైన కన్వీనర్ డాక్టర్ పిల్లోడి. లక్ష్మయ్య,కోకన్వీనర్ కె.రేణుకలు మాట్లాడుతూ తమ పూర్తి కమిటీని ఏప్రిల్ 5వ తేదీ లోపు ప్రకటిస్తామని తెలిపారు.





## గిరిజనులపై జంతువుల్లా దాడి చేసినా పట్టించుకోరా: విజయశాంతి

హైదరాబాద్,మార్చి 29, ప్రజాపాలన ప్రతినిధి: నాగర్‌కర్నూల్ జిల్లాలోని అటవీ ప్రాంతంలో గిరిజనులపై జరిగిన దాడిని రాష్ట్ర బీజేపీ మహిళా నేత విజయశాంతి తీవ్రంగా ఖండించారు. గిరిజనులపై అడవి జంతువుల కంటే క్రూరంగా దాడి జరిగిందని, ఆ దాడి జరిగి రెండు రోజులు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోవడం ఏంటని మండిపడ్డారు. ఈ మేరకు తన ఫేస్‌బుక్ ఖాతాలో ఓ పోస్ట్ షేర్ చేశారు. ఆ పోస్ట్‌లో ఇలా రాసుకొచ్చారు. "తెలంగాణలోని గిరిజనుల పట్ల అడవి జంతువుల కంటే క్రూరంగా, హీనంగా, దాడి జరిగి రెండు రోజులు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదు. నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట మండలానికి చెందిన కొందరు గిరిజనులు ఇప్పపూల కోసం అటవీ ప్రాంతంలోకి వెళ్లి రాత్రి పొద్దుపోవడంతో అక్కడే నిద్రపోవడం వారి పాలిట శాపమైంది. అదేదో మహాపాపం అన్నట్టు అటవీ శాఖ సిబ్బంది ఆ గిరిజనులపై దాడి చేసి పెద్దాచిన్నా, మహిళలు, పురుషులని చూడకుండా బూటుకాళ్లతో తన్ని జననాంగాలను గాయపరిస్తే ఉన్నతాధికారులు మాత్రం తూతూమంత్రంగా పరామర్శించి వెళ్ళిపోయారు. అడవి తల్లిని ఆశ్రయించుకుని బతుకుతున్న గిరిజన బిడ్డలు మీకేం అపకారం చేశారు? అగ్ని ప్రమాదాలంటూ గిరిజనులకు అటవీ ఉత్పత్తులు దక్కకుండా చేస్తే వారెలా బతకాలి? అటవీ అధికారులు, గిరిజనుల మధ్య ఎప్పటి నుంచో నలుగుతున్న ఈ సమస్యకు పరిష్కారం కోసం బాధ్యతగల పాలకులుగా మీరు చూపిన ప్రత్యామ్నాయమేంటి? అసలు అడవుల పరిరక్షణకు తెలంగాణ సర్కారు తీసుకుంటున్న చర్యలేమిటి? ఒక్కసారి ఈ లెక్కలన్నీ తీస్తే సర్కారు చేతగానితనమంతా బయటపడుతుంది. ఇదంతా చాలక మరోవైపు డిచ్‌పల్లి మండలం యానంపల్లి తండాలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఉన్న బీజేపీ గిరిజన మోర్చా నేతలపై టీఆరెస్ నేతలు దాడికి పాల్పడ్డారు. మొన్నటికి మొన్న గుర్రంపోడు భూముల వ్యవహారంలోనూ అధికార పార్టీది ఇదే తీరు. గిరిజనుల భూముల్ని ఆక్రమించుకోవడమే కాకుండా ప్రశ్నించినందుకు బీజేపీ నేతలపై దాడులు చేయించి, జైలుకు పంపి పైశాచికానందం పొందారు. చివరికి జర్నలిస్టులనూ మీరు వదల్లేదు. గిరిజనులపై మీరు కక్షకట్టారా? తెలంగాణలో ఎక్కడ చూసినా దాడుల విష సంస్కృతిని పెంచి పోషిస్తున్న అధికార పార్టీని వారి చర్యలే సర్పాలై కాటేయడం ఖాయం' అని విజయశాంతి తన పోస్టులో పేర్కొన్నారు.



## తెలంగాణ నిరుద్యోగులకు శుభవార్త.. 50 వేల ఉద్యోగులకు డేట్ ఫిక్స్ !



హైదరాబాద్,మార్చి 29, ప్రజాపాలన ప్రతినిధి:తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని నిరుద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పేందుకు సిద్ధమవుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ కు ముందు సీఎం కేసీఆర్.. తెలంగాణలో 50 వేల ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా ఉద్యోగాల భర్తీ ప్రక్రియకు బ్రేక్ పడింది. అనంతరం నాగార్జున సాగర్ ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ రిలీజ్ చేసింది. ఈ ఉప ఎన్నికలు ముగిసిన వెంటనే వరుసగా ఉద్యోగాల నోటిఫికేషన్‌లు విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఉప ఎన్నిక ముగిసిన అనంతరం ఏప్రిల్ మూడో వారంలో మొదటి ఉద్యోగ నోటిఫికేషన్ రిలీజ్ కానున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖల్లోని ఖాళీల జాబితాను చీఫ్ సెక్రటరీ సోమేష్ కుమార్ సీఎం కేసీఆర్‌కు అప్పగించారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ విభాగాల్లో 55 వేల ఖాళీలు ఉన్నట్లు సమాచారం. ఇందులో పోలీస్ శాఖలోనే ఎక్కువగా ఉద్యోగాలు ఉన్నట్లు తెలుస్తోంది. టీచర్ ఉద్యోగ ఖాళీలు సైతం అధికంగానే ఉన్నాయని సమాచారం. అయితే.. నోటిఫికేషన్ మాత్రం వచ్చే నెలలో వచ్చే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

## ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్‌కు ఏమైంది?

ముంబై,మార్చి 29, ప్రజాపాలన ప్రతినిధి: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధినేత, కేంద్ర మాజీమంత్రి శరద్ పవార్.. ఆసుపత్రిలో చేరారు. ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో ఆయన అడ్మిట్ అయ్యారు. బుధవారం ఆయనకు సర్జరీ కూడా నిర్వహించబోతున్నారు. ఈ విషయాన్ని పార్టీ సీనియర్ నాయకుడు నవాబ్ మలిక్ వెల్లడించారు. ఆదివారం సాయంత్రమే ఆయన ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారని, 31వ తేదీన ఎండోస్కోపీ అనంతరం సర్జరీ నిర్వహిస్తారని చెప్పారు. మహారాష్ట్రలో శివసేన సారథ్యంలో అధికారంలో ఉన్న మహా వికాస్ అగాఢీ సంకీర్ణ కూటమిలో ఎన్సీపీ భాగస్వామ్య పక్షంగా కొనసాగుతోంది. ఇటీవలే శరద్ పవార్..గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు.పొత్తి కడుపులో నొప్పితో శరద్ పవార్ బాధపడుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి పొత్తి కడుపులో నొప్పి తలెత్తింది. దీనితో ఆయనను సాయంత్రం ముంబైలోని బ్రీచ్‌క్యాండీ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు ఆయనకు పరీక్షలను నిర్వహించగా.. మూత్ర నాళం (గాల్ బ్లాడర్)లో సమస్యలు తలెత్తినట్లు గుర్తించారు. తాత్కాలికంగా నొప్పి నుంచి ఉపశమనం పొందడానికి టాబ్లెట్లు ఇచ్చారు. గాల్ బ్లాడర్‌లో ఇబ్బందులను తొలగించడానికి సర్జరీ అవసరమౌతుందని చెప్పారు. బుధవారం శదర్ పవార్‌కు ఎండోస్కోపీ, సర్జరీ నిర్వహిస్తారని నవాబ్ మలిక్ పేర్కొన్నారు.ముంబై మాజీ పోలీస్ కమిషనర్ పరమ్‌బీర్ సింగ్ చేసిన 100 కోట్ల రూపాయల కలెక్షన్ ఆరోపణలను ఎదుర్కొంటోన్న మహారాష్ట్ర హోమ్ శాఖ మంత్రి అనిల్ దేశ్‌ముఖ్.. ఎన్సీపీకి చెందిన ఎమ్మెల్యే. ఆయనకు మద్దతుగా ఇటీవలే శరద్ పవార్ మీడియాతో మాట్లాడారు. పరమ్‌బీర్ సింగ్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు, ప్రతిపక్ష నేత దేవేంద్ర ఫడ్నవీస్ పెద్ద ఎత్తున అనిల్ దేశ్‌ముఖ్, ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరేకు వ్యతిరేకంగా ప్రచారాన్ని చేపడుతున్నారు. ఈ పరిస్థితుల మధ్య శరద్ పవార్.. అహ్మదాబాద్‌లో అమిత్ షాతో భేటీ కావడం రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది.



ప్రజాపాలన

సంపాదకీయం

మంగళవారం 30, మార్చి 2021

# అవార్డులు - అరాచకాలు

ఒక పరీక్షలో టాప్ మార్క్స్ వచ్చినవాళ్లకు సాధారణంగా చప్పట్లు దక్కుతాయి. అదే - పరీక్షలో కాపీ కొట్టో, లేదా కౌంటింగ్ రాంగ్ అయ్యో, లేదా కంప్యూటర్ మిస్టేక్ వలననో టాప్ మార్క్స్ వచ్చినా - వాళ్లకు కూడా చప్పట్లు దొరుకుతాయి. కానీ అవి నిలబడవు. ఈ మధ్య ప్రకటించిన కేంద్ర సాహితీ అవార్డుల పరంపర కూడా అలాంటిదే. ఈ మధ్యే కాదు- కొద్ది సంవత్సరాల నుండి జరుగుతున్న తంతు ఇదే !నిజానికి 1944లో 'రాయల్ ఏషియాటిక్ సొసైటీ' సాహిత్యాన్ని ప్రోత్సాహించాలని అందుకు కొన్ని ప్రభుత్వ ట్రస్టులను ప్రత్యేకంగా ఏర్పరచాలని మొదటగా ప్రతిపాదించినా, చివరికి 1952లో అప్రూవ్ అయ్యి 1954లో అకాడెమీ ఏర్పాట య్యింది. అప్పటి నుండి ఇప్పటి దాకా ఎన్నో సాహిత్య అకాడమీ అవార్డులు ప్రకటిస్తూ వచ్చారు. ఇంగ్లీషు, సంస్కృతంతో సహా పలు భాషల్లో ప్రకటిస్తున్నారు. ప్రధాన అవార్డుతో పాటు యువ పురస్కారం కూడా ప్రకటిస్తూ వస్తున్నారు. ఇప్పటివరకు ఈ అవార్డు గ్రహీతల్లో సురవరం ప్రతాపరెడ్డి, సినారె, బోయి భీమన్న, తాపీ ధర్మారావువంటి చేయితిరిగిన సాహితీవేత్తలు మొదలుకొని అవార్డు వచ్చినవాళ్ళు వందల్లో ఉంటారు. ఈ జాబితాలో- శ్రీశ్రీ, చెరబండరాజు, కాళోజీ, అల్లం రాజయ్య, బజరా, వరవరరావు, అలిశెట్టి ప్రభాకర్ లాంటి వాళ్ళు ఎవరూ లేరు. కొందరు ఇందులో అవార్డు ప్రకటించక ముందే తిరస్కరించిన వారున్నారు. అవార్డులు వచ్చిన చాలామంది సాహితీవేత్తలతో వీరిని పోలిస్తే, అవార్డులు పొందని, స్వీకరించనివాళ్ళ సాహితీ ప్రయోగాలు వినూత్నమే కాక, ప్రమాణాలు కూడా చాలా మెరుగైనవి. ఈ మధ్య సాహిత్య అకాడెమీ అవార్డులలో అడపా దడపా దళితులకు మైనారిటీలకు అక్కడక్కడ చోటు కలిపించినా - ఇందులో anti-establishment రచనలను ఉద్దేశ్యపూర్వ కంగా ఎలిమినేట్ చేస్తున్నారు. ఈ సెక్షన్స్ నుండి ఉన్న రచయితలను appropriate చేసుకునే ప్రక్రియలో భాగంగానే వారికి చోటు కలిపించడం జరుగుతోంది తప్ప - నిజంగా ఇక్కడ గొప్ప సాహితీ ప్రయోగాలు జరిగాయనీ కాదు, ఇవి గొప్పగా ప్రజల్లో ఒక చైతన్యాన్ని తీసుకువచ్చాయనీ కాదు. ఈ దళిత వెనుకబడిన వర్గాల రచయితలకు ఎరవేసి తొలి అడుగు ల్లోనే pro-establishmentగా తిప్పుకునే ఉద్దేశ్యం తప్ప, దళిత బహుజన వర్గాలకు సముచితమైన స్థానం కల్పించాలని కాదు. ఆయా నిమ్న వర్గాల రచనలలో మిన్నగా ఉన్న సాహితీ ప్రక్రియలను ప్రోత్సహించే ఉద్దేశ్యమూ కాదు. అకాడెమీ రెఫరీలకు, జ్యూరీకి- రచయితలు/ రచయిత్రులు కేవలం రచనల ద్వారా మాత్రమే తెలియాల్సిన అవసరం ఏనాడూ గుర్తింప బడలేదు. గత దశాబ్ద కాలంలో అవార్డులను గమనిస్తే- అకాడమీ సభ్యులకు రచయితలతో అప్పటికే ప్రత్యక్ష పరిచయాలు, సంబంధాలు ఉన్న సందర్భాలే ఎక్కువ. ఇటువంటి పరిస్థితి లో- ఎటువంటి తటస్థతను మనం ఆశించ గలము? రెఫరీలు రెకెమెండ్ చేస్తున్నప్పుడే ఈ అవార్డు ఎటుపోతుందో తెలిసిపోతుంది. నిజానికి కేంద్ర సాహిత్య అకాడమీ ఒక పారదర్శకమైన, శాస్త్రీయమైన ప్రమాణాలతో, అన్ని వర్గాలకు తగినంత ప్రాతినిధ్యం ఉండేలా విలువలు, కొలతలు ఏర్పరిచి రచనలను ఎన్నుకున్న దాఖలాలు లేవు. అకాడెమీ సభ్యులు ఫేవరిటి జమ్‌కు పాల్పడుతున్నారు అంటే అది పూర్తిగా వాళ్ళ తప్పు కాదు.

అకాడెమీ కొన్ని ప్రమాణాలు పబ్లిక్‌తో పంచుకోవాల్సిన అవసరం ఉంది. ఎంపికైన రచనలను, ఎంపికకు కారణాలను, వాటితో పాటు ఆ రచనల సాంఘిక నేపథ్యాన్ని వివరంగా పబ్లిక్‌తో పంచుకోవాల్సిన అవసరం ఉంది. ఈ ఎంపిక పద్ధతి మూడు నాలుగు స్వతంత్ర కమిటీలనుంచి వెళ్ళవలసిన అవసరం ఉంది. నిజానికి కేంద్ర సాహిత్య అకాడెమీ రెఫరీ, జ్యూరీల వివరాలు ప్రాచుర్యంలో ఉండరాదు. కానీ దురదృష్టం ఏమంటే - అందరూ అందరికీ తెలుసు. దీనివల్ల నెట్‌వర్కింగ్, %జూబఎశ్రీఅఎ తీవశ్రీఖు- "ఆశీఅం% అన్నవి రచయితకు ఉండాల్సిన ఒక స్పెషల్ స్కిల్‌గా తయారయ్యింది. ఈమధ్య వచ్చిన అవార్డులను పరిశీలిస్తే తండ్రో, కుటుంబ మిత్రుడో, peer relation ఉన్నవాళ్ళో ఈ అకాడెమీలో ఉండడం జరుగుతోంది. వచ్చే ఏడాది జాబితాలో ఉండే అకాడెమీ అవార్డు విన్నర్లు ఎవరో - అంతో ఇంతో సాహితీ పిపాస ఉన్న వాళ్లకు ఇప్పటికే తెలుసు అంటే అతిశయోక్తి కాదు. ఎంతో ఉన్నతమైన ఉద్దేశ్యంతో ఏర్పడ్డ ఈ సాహిత్య అకాడెమీ వ్యవస్థ ఫేవరిటిజానికీ, నెపోటిజానికీ బలైపోయింది. సాహిత్య అకాడమీ వ్యవస్థను పారదర్శకంగా తీర్చిదిద్దడం అవసరం. వీలైతే దీనిని ఆర్‌టిఐ పరిధిలోకి తీసుకురావాలి. ప్రజలకు జవాబు దారీగా ఉండే వ్యవస్థగా మార్చాలి. మనం నిర్దిష్ట సాహితీ క్రియకు వచ్చిన అవార్డు వ్యవహారాన్ని విశ్లేషించి చూడవచ్చు. ఐతే ఈ వ్యాస ఉద్దేశ్యం ఒక రచయితనో రచయిత్రినో విశ్లేషణ పేరుతో de-mean చేయడం కాదు గనుక, అందునా ఇవన్నీ సాహితీ రంగంలో ఉన్న ప్రతి ఒక్కరికి తెలిసిన విషయాలే కాబట్టి, ఈ సాహితీ ప్రోత్సాహకాన్ని కాపాడుకోవాలి అనే పరిధిలోనే రాస్తున్నాను. ఒకప్పుడు వ్యక్తిత్వ విలువలున్న బోయి భీమన్న లాంటి వాళ్లు అవార్డు గ్రహీతలుగా ఉన్నారు. ఈ రోజు కెరీరిజంలో కొట్టుకుపోయిన రచయితలు, రచయిత్రులే కనిపిస్తున్నారు. అంతే తప్ప ప్రజాస్వామిక విలువలకు లోబడి, నిబద్ధత కలిగి, వినూత్నంగా సాహితీ విలువలను ప్రక టించే రచనలు బహుకొద్దిగా ఉన్నాయి. సగం సాహిత్యం అర్బన్ నక్సల్స్ అని కొట్టివేయగా, మిగిలినదానిలో సగం కెరీరిజం తినేయగా, ఆ మిగతా సగం కమర్షియల్, సినిమా సాహిత్యా లకు పరిమితం అవుతున్నాయి. మరి మనకు నిజంగా, గర్వంగా టాప్ మార్క్ వచ్చిందని చెప్పుకునే అవకాశం ఏది? అది ఎప్పుడు సంపాయించుకోగలం?



## ఒకే రంగు ఆకాశం!

నా విశాల బాహువుల మీద
మీరంతా నిశ్చింతగా నిద్రపొండి
మీ ఆకలీ ఆశల గురించీ
మీ స్వేదం మీ రెక్కల సంగతీ
మరచిపోండి
కేవలం ఐదేళ్లకోసారి
శ్రద్ధగా మరకలు పడితే చాలు
నేను మీకోసం
స్వర్గంలాంటి గుడి కడతాను
మీ కోసం కొన్ని యుద్ధాలు చేస్తాను
దేశాన్నొక పావురాన్ని చేసి
ఎగరేయాలని తపిస్తూ
ప్రాణాలొదిలేసిన ప్రతి వీరుడికీ
ఓ స్మారకాన్ని నిర్మిస్తాను
ప్రతిసారీ ఓ మహావీరుడి ముసుగును
తగిలించుకుని మీ ముందుకొస్తాను
ఒకే ఒక్క స్వప్నం నాది!
ఒకే దేశం... ఒకే మతం...
ఒకే రంగు ఆకాశం!
మీ రుధిరాన్ని నాకివ్వండి
నా కలల ఆకాశాన్ని చిత్రించుకుంటాను
మీ గుండెల్ని పెకలించి ఇవ్వండి
నా కోటకు తోరణాలుగా కట్టుకుంటాను
రైతుల్లారా! కార్మికుల్లారా!
ఈ దేశపు పవిత్ర మట్టిలో
ఏ పోరాటాల్నీ విత్తకండి
ఈ దేశపు బంగారు గోడల మీద
ఏ నినాదాల్నీ రాయకండి
ఇదిగో! మీ కోసం
తలా పిడికెడు బానిసత్వాన్నిస్తున్నాను
తృప్తిగా నిద్రపొండి!

- సా

# కరోనా భయం గుప్పిట్లో బడులు సాగేదెలా?



ఇటీవలి కాలంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా కరోనా వేగంగా విస్తరిస్తోంది. దీనివల్ల స్కూళ్లు, కాలేజీలు మీద ఈ వైరస్ ప్రభావం అధికంగా ఉంటోంది. దీనితో కొన్ని చోట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు కొవిడ్ బారిన పడుతున్నారు. అయితే పిల్లల్లో లక్షణాలు ఉంటే వారిని ఇళ్లకు పంపిస్తున్నారు తప్ప. కోవిడ్ పరీక్షలు చేయించడం, ముందు జాగ్రత్త చర్యలు కూడా తక్కువగానే ఉంటున్నాయి. కోవిడ్ లక్షణాలు ఉన్నవారిని ఇంటికి పంపించినప్పటికీ వారికి హాజరు నుంచి ఎటువంటి మినహాయింపు ఇవ్వడం లేదని తల్లిదండ్రులు వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజూ స్టూడెంట్ యాప్ ద్వారా హాజరు తీస్తున్నారు. భవిష్యత్తులో ఈ హాజరు శాతం అమ్మఒడి కోసం వాడుకోవచ్చనే సందేహాలు తల్లిదండ్రులలో ఉండటంతో జ్వరం, జలుబు లాంటి కోవిడ్ లక్షణాలు ఉన్నప్పటికీ హాజరు శాతం తగ్గకూడదని పిల్లలను తల్లిదండ్రులు స్కూళ్లకు పంపుతున్నారు. దీనివల్ల ఎక్కడ తమకు కరోనా సోకుతుందోనని భయంభయంగా స్కూళ్లకు విద్యార్థులు, ఉపాధ్యాయులు వెళుతున్నారు. కరోనా తీవ్రతతో అప్రమత్తమైన కేంద్రం ఏప్రిల్ నెలాఖరు వరకు నూతన మార్గదర్శకాలు విడుదల చేసింది. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు కూడా ఉత్తర్వులు జారీచేశారు. దీని ప్రకారం పాఠశాలకు వచ్చే విద్యార్థులు అందరూ మాస్క్ ధరించాలి, భౌతిక దూరం పాటించాలి. పాఠశాలల్లో అసెంబ్లీ నిర్వహించరాదు. తరగతి గదికి ఇరవై మంది విద్యార్థులు మాత్రమే ఉండేటట్లు చూడాలి. బెంచీల సైజులను బట్టి రెండు లేదా ముగ్గురిని కూర్చోబెట్టాలి. స్టూడెంట్స్ లో ఎటువంటి కోవిడ్ లక్షణాలు కనిపించినా సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కాంటాక్ట్ చేసి పరీక్షలు చేయించాలి. 45 సంవత్సరాల దాటిన ఉపాధ్యాయులందరూ వ్యాక్సిన్ ని వేయించుకోవాలి. మధ్యాహ్న భోజన పథకాన్ని హైస్కూల్స్ లో ఒక తరగతి తర్వాత ఒక తరగతికి భోజనం పెట్టేలా చర్యలు తీసుకోవాలి. కానీ రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో కరోనా నిబంధనలు ఎక్కడా పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. అంతేగాక ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు మాస్కులు ధరించలేక పిల్లలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోనీ మాస్కు తీసేద్దామనుకుంటే భౌతిక దూరం నిబంధన కూడా పాటించడం లేదు. తరగతి గదుల్లో ఒక్కో బెంచ్‌కి నలుగురు, ఐదుగురు చిన్నారులను కూర్చోబెడుతున్నారు. శానిటైజేషన్ చేయడం లేదు. ప్రభుత్వ స్కూళ్ళలో ఇరుకైన తరగతి గదులు, సరైన మౌలిక సదుపాయాలు అందుబాటులో లేకపోవడం వల్ల కోవిడ్ నిబంధనలు అమలు చేయడం కష్టతరమవుతోంది. బడికి వెళ్లకపోతే హాజరు సమస్య, వెళితే కరోనా భయం, ఈ రెండింటి మధ్య చిన్నారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అయితే ఆన్లైన్లో విద్యా బోధన ప్రసక్తే లేదని, ఆన్లైన్ క్లాసుల వల్ల ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని, ప్రస్తుతానికి స్కూళ్లకు సెలవులు ఇచ్చే పరిస్థితి లేదని, స్కూళ్లలో కరోనా వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకుంటున్నామని, విద్యార్థులు, తల్లిదండ్రులు భయపడొద్దని, కోవిడ్ ప్రోటోకాల్స్ ను తప్పకుండా పాటించాలని, మాస్క్ లు తప్పనిసరిగా ధరించాలని ప్రభుత్వం చెబుతోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం స్కూళ్లు మూసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పేసింది. కరోనా విజృంభణ నేపథ్యంలో ఏప్రిల్ 1 నుంచి ఒంటిపూట బడులు పెట్టాలని నిర్ణయించింది. మే 14 వరకు ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు పాఠశాలలు పనిచేసేలా షెడ్యూల్ విడుదల చేసింది. అలాగే మే 15 నుంచి వేసవి సెలవులు ప్రకటించింది ప్రభుత్వం. 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు మాత్రమే ఈ సెలవులు వర్తిస్తాయని పేర్కొంది. ఎస్‌సీఈఆర్‌టీ షెడ్యూల్ ప్రకారం టెన్త్ విద్యార్థులు, టీచర్లకు వేసవి సెలవులు లేవని ప్రకటించింది. విద్యా సంస్థల్లోనూ కేసులు నమోదువుతుండటంతో అప్రమత్తమైన పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు విద్యార్థుల రక్షణను దృష్టిలో ఉంచుకొని మరోసారి విద్యా సంస్థలు మూసివేస్తూ నిర్ణయం తీసుకున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో విద్యా సంస్థలన్నింటినీ మూసివేయగా మరికొన్ని చోట్ల కేవలం 1 నుంచి 8తరగతుల వరకు పాఠశాలల్లో తరగతులు రద్దు చేశారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన కొత్త మార్గదర్శకాల ప్రకారం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఆర్‌టి-పిసిఆర్ పరీక్షలు పెంచాలని, పాజిటివ్ వచ్చిన వారిని క్వారంటైన్‌లో ఉంచి చికిత్స అందించాలని, ఆ తర్వాత ట్రేసింగ్ ప్రక్రియను చేపట్టాలంది. అయితే ఏప్రిల్ 30 వరకు 'కరోనా' 'అన్ లాక్ డౌన్' నిబంధనలు పొడిగిస్తున్నట్లు కేంద్ర హోం శాఖ ప్రకటించింది. కరోనా వ్యాప్తి, విజృంభణ నేపథ్యంలో రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర హోంశాఖ పేర్కొంది. కేంద్ర హోంశాఖ విడుదల చేసిన కరోనా నిబంధనలు, మార్గదర్శకాలు కఠినంగా అమలు చేయాలని, అన్ని రాష్ట్రాలు 'ఆర్టీ పీసీఆర్' టెస్టుల సంఖ్య 70 శాతానికి పెంచాలని ఆదేశాలు జారీ చేశారు. పాజిటివ్ వచ్చిన వారికి సరైన చికిత్స అందించాలని క్షేత్రస్థాయిలో కరోనా మార్గదర్శకాలు, నిబంధనలు అమలయ్యేలా స్థానిక అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ప్రజల రద్దీ బాగా ఉండే ప్రాంతాల్లో, పనిచేసే ప్రాంతాల్లో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఆయా రాష్ట్రాలు ప్రత్యేకంగా ఆంక్షలు విధించవచ్చని పేర్కొంది. భారత్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ కోవిడ్ పెరుగుతూ వస్తున్నాయి. దీంతో అప్రమత్తమైన ప్రభుత్వం మరోసారి కోవిడ్ నిబంధనలు అమలు చేసే విషయంపై సీరియస్‌గా దృష్టిసారించింది. ఫ్యాక్టరీలు, పరిశ్రమలు, వాణిజ్య సముదాయాల్లో కోవిడ్ నిబంధనల్ని అమలు చేయాలని మరోమారు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కరోనా రెండో దశ వ్యాపిస్తున్నందున్న నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించింది. అవకాశం ఉన్నంత మేర వర్క్ ఫ్రమ్ హోం విధానాన్ని మరో మారు అవలంభించాల్సిందిగా ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. దేశంలోనూ రాష్ట్రంలోనూ కరోనా కేసులు పెరుగుతున్న దృష్ట్యా పరిశ్రమలు, దుకాణ సముదాయాలు, ఫ్యాక్టరీల్లో నియంత్రణా చర్యలకు ఆదేశాలు జారీ చేసింది. రవాణా వాహనాలు, యంత్రాలు, ప్రాంగణాల్ని ఎప్పటికప్పుడు వైరస్ రహితంగా చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించింది ప్రభుత్వం. శానిటైజేషన్ ప్రక్రియను ఎప్పటికప్పుడు చేపట్టాల్సిందిగా స్పష్టం చేసింది. వాణిజ్య సముదాయాలు, పరిశ్రమలు, దుకాణాల్లోకి ప్రవేశించే సమయంలో థర్మల్ స్కానింగ్ చేయాల్సిందిగా సూచనలు చేసింది. మాస్కులు, శానిటైజేషన్, భౌతిక దూరం విధిగా పాటించేలా చూడాలని స్పష్టంగా తెలిపింది. డైనింగ్ హాళ్లు, క్యాంటీన్లలో ప్రతీ రెండు గంటలకూ శానిటేషన్ చేయాలని, ఉద్యోగులు, సిబ్బందికి వ్యాక్సినేషన్ వేయించేందుకు చర్యలు తీసుకోవాలని యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేసింది. కరోనా కట్టడి చేసేందుకు టెస్ట్, ట్రేస్, ట్రీట్మెంట్ కార్యక్రమాన్ని పూర్తిగా అమలు చేయాలి, టెస్టుల సంఖ్య పెంచాలి, కోవిడ్ కాంటాక్ట్ సోర్సు వ్యక్తులను వెంటనే గుర్తించాలి, వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ ఆధ్వర్యంలో పూర్తి వైద్యం అందించాలి, కోవిడ్ ఆసుపత్రుల సంఖ్యను పెంచి తగినంత మంది వైద్యులు మరియు వైద్యేతర సిబ్బందిని నియమించాలి. మందులు, పీపీఈ కిట్లు, లేబరేటరీలు లాంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి, ప్రజలందరితో, వ్యాక్సిన్ తీసుకున్న వారితో సహా భౌతిక దూరం, మాస్కులు వాడటం మరియు చేతులు సానిటైజ్ చేసుకోవడం విధానాన్ని కచ్చితంగా అమలు చేయించాలి, దీని అమలు కోసం ప్రజలలో విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు జరపాలి, కోవిడ్ నిబంధనలు అమలు చేయక పోవడం వల్ల కరోనా వ్యాధి ఉధృతికి పాఠశాలలు మరియు కళాశాలలు కేంద్రంగా మారుతున్నాయి . కనుక కొవిడ్ నిబంధనలు సరిగా అమలు చేయని యాజమాన్యాలపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి, అవసరమైతే తాత్కాలికంగా స్కూళ్ళ కాలేజీల నిర్వహణను నిలుపుదల చేయాలి, బారులు, మద్యం దుకాణాలు, మాల్స్ బజారులు, పబ్లిక్ మరియు ప్రయివేట వాహనాలలో ప్రయాణీకుల పట్ల, బస్ స్టేషన్, రైల్వే స్టేషన్ ప్రాంగణాల వద్ద కోవిడ్ కట్టడి ప్రోటోకాల్ అమలు చేయాలి, అమలు చేయని, పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి. కరోనా వ్యాక్సిన్ ప్రజలందరికి ఉచితంగా అందించాలి. కరోనా వ్యాక్సిన్ వేయించుకోవడానికి ప్రజలు భయ పడుతున్న కారణంగా ప్రజలందరూ వేయించుకునే విధంగా ప్రజలను చైతన్యవంతం చేయాలి. గ్రామస్థాయిలో కరోనా వ్యాక్సినేషన్ కార్యక్రమం వైద్యుల పర్యవేక్షణ లేకుండానే జరుగుతుంది. అలా కాకుండా ప్రాథమిక వైద్య సదుపాయాలతో, అంబులెన్స్ అందుబాటులో, వైద్యుల ఆధ్వర్యంలోనే కరోనా వ్యాక్సినేషన్ జరిగే విధంగా చూడాలి. కరోనా మొదటి దశలో వైద్య సేవలు అందించిన డాక్టర్లు మరియు వైద్య సిబ్బందిని మళ్లీ విధుల్లోకి తీసుకుని కరోనా వైద్యాన్ని ప్రజలకు అందించే విధంగా చూడాలి.

- వాసిలి సురేష్
9494615360



## పాదయాత్ర విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్ ఆవిష్కరణ

వలిగొండ, మార్చి 29, ప్రజాపాలన ప్రతినిధి:మండలంలో ఏప్రిల్ 2వ తేదీన మొదలయ్యే జన చైతన్య పాదయాత్ర జయప్రదం చేయాలని కోరుతూ సోమవారము పార్టీ కార్యాలయంలో పోషణ ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వేముల మహేందర్,మండల కార్యదర్శి మద్దెల రాజయ్యలు మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా సాగు త్రాగునీరు,విద్య,వైద్యం, ఉపాధి,భూసమస్య, కాలుష్యం,సంక్షేమం,ప్రజా సమస్యల సాధనకై జరిగే పాదయాత్ర మండలంలో రెండవ తేదీ సాయంత్రం సంగం,వర్కట్పల్లి,గోకారం మూడవ తేదీ ఉదయం జాలు కాలువ,గొల్లపల్లి, నెమలికాలువ నాగారం 12 గంటలకు వలిగొండ భోజనానంతరం మల్లెపల్లి, వెల్వర్తి,మొగిలిపాక చేరుకుంటుందన్నారు. నాలుగవ తేదీ ఉదయం కదిరిగూడెం,కెర్చిపల్లి,వీర్ల గడ్డ,సుంకిశాల,పులిగిల్ల కు చేరుకుంటుందని తెలిపారు. ఈ గ్రామాలలో జరిగే పాదయాత్రలు పార్టీ సభ్యులు ప్రజా ప్రతినిధులు స్థానిక ప్రజలు అన్ని రంగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.పోస్టర్ ఆవిష్కరణలో కల్పూరి రామచంద్ర,గరిదాసు నరసింహ,కవిడే సురేష్, వడ్డెబోయిన వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## కరోనా బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్



జగిత్యాల, మర్చి 29 (ప్రజాపాలన ప్రతినిధి):జగిత్యాల పట్టణంలోని 15వ వార్డుకు చెందిన బుడగజంగల కాలనిలో 15 మందికి కరోన పాజిటివ్ నిర్ధారణకాగ స్థానిక ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ వార్డును సందర్శించి కరోనా బాధితులను పరామర్శించారు.శానిటేషన్ కోవిడ్ మెడికల్ కిట్లను పంపిణీ చేసి ప్రత్యేకంగా పర్యవేక్షించిన అనంతరం వార్డ్ ప్రజలకు అవగాహన కలిపించారు. ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకుని అన్ని రకాల సదుపాయాల గుర్చి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పరిస్థితి ఇబ్బంది ఉంటే వెంటనే తెలియజేయాలని ప్రత్యేక వైద్య చికిత్సకు తరలిస్తామని పేర్కొన్నారు. కరోనాపట్ల ఆందోళన చెందకుండ మానసిక ధైర్యంతో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ భోగ శ్రావణి ప్రవీణ్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్ స్థానిక కౌన్సిలర్ వారణాసి మల్లవ్వ తిరుమల్లయ్య ప్రభుత్వ వైద్యులు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ 40వ ఆవిర్భావ దినత్సవం వేడుకలు



జగిత్యాల, మర్చి 29 (ప్రజాపాలన ప్రతినిధి): తెలుగు దేశం పార్టి 40వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను జగిత్యాల జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహంకాళి రాజన్న ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దయాల మాల్లారెడ్డి కొండ శ్రీధర్ వనామాల నిరంజన్ ఏలేటి సురేందర్ రెడ్డి పులి మల్లేశం కోరుకంటి రాము అక్కినపల్లి కాశినాథం గడ్డం లక్ష్మీపతి బుర్ర శ్రీధర్ అరే శంకర్ మగ్గిడి గంగాధర్ వేముల శంకర్ సర్వేశ్వర్ శ్రీనివాస్ శ్రీధర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీ ఆర్ 3 కెనాల్ కు గండి:జడ్పీ చైర్ పర్సన్ వసంత కు విన్నవించిన గ్రామస్తులు

జగిత్యాల, మర్చి 29 (ప్రజాపాలన ప్రతినిధి): జగిత్యాల మండలం మోరపల్లి గ్రామానికి చెందిన ఎస్సారెస్పీ ఆర్ 3 కెనాల్ కు గండి పడడంతో గ్రామానికి ప్రమాదం పొంచి ఉండడంతో గ్రామ రైతులు జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతను కలిసి విన్నవించగా వెంటనే స్పందించి చైర్ పర్సన్ జిల్లా కలెక్టర్ రవికి ఫోన్ చేసి సమస్యను వివరించారు. స్పందించిన కలెక్టర్ వెంటనే ఎస్సారెస్పీ అధికారులతో మాట్లాడడంతో మోరపల్లి గ్రామానికి వెళ్లే కెనాల్ నీటి మట్టాన్ని తగ్గించారు. దీంతో పెను ప్రమాదం తప్పిందని మోరపల్లి గ్రామస్థులు జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేశ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.



# ప్రముఖ సీనియర్ న్యాయవాది అబ్దుల్ రజాక్ మాతృమూర్తి వియోగం పట్ల మద్దెల సంతాపం

### స్వర్గీయ కుబ్రా బేగం ఎంతో గొప్ప ఔన్నత్యం

### దాతృత్వం గల గొప్ప మాతృమూర్తి

### భారతరత్న అంబేడ్కర్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మద్దెల శివ కుమార్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మార్చి 29, ప్రజాపాలన ప్రతినిధి:ప్రముఖ సీనియర్ న్యాయవాది మరియు అభ్యుదయవాది అయిన అబ్దుల్ రజాక్ గారి మాతృమూర్తి శ్రీమతి కుబ్రా బేగం( 85 స0 )ఎంతో గొప్ప మంచి మనసున్న మానవతా మూర్తి అని అందరినీ ఆదరించి గౌరవించే ఆదర్శ మూర్తి అని ఆమె అకాల మృతి ఎంతో హృదయవిదారక మని భారతరత్న అంబేడ్కర్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మద్దెల శివకుమార్ ఉద్ఘాటించారు. 29 03 2021 నాడు మద్దెల తన బృందంతో హౌసింగ్ బోర్డు కాలనీలో గల న్యాయవాది అబ్దుల్ రజాక్ స్వగృహానికి వెళ్లి వారి మాతృమూర్తి అయినకుబ్రా బేగం భౌతికకాయం వద్ద పూలమాలలు పుష్పాలతో ఘనంగా నివాళులు అర్పించారు.

అబ్దుల్ రజాక్ ను ఓదార్చి వారి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలియజేశారు. ఈ నివాళి కార్యక్రమంలో మద్దెల తోబాటు సంఘ నాయకులు సబ్బవరపు మధుసూదన్ చిన్ని అంతోటి పాల్ మందా హనుమంతు కూ సపాటి శ్రీనివాస్ అంతోటి రాజు రఘు మాజీ సింగరేణిలి లిఅధికారి సాయి కృష్ణ ప్రముఖ న్యాయవాదులు మెండు రాజమల్లు అడపాల పార్వతి , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ దస్తగిరి సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నాగపల్లి లక్ష్మీ నరసింహుడి బ్రహ్మోత్సవాలు



వెల్గటూర్, మార్చి 29(ప్రజాపాలన ప్రతినిధి) : వెల్గటూర్ మండలం కిషన్ రావు పెట శ్రీ నాగ పల్లి లక్ష్మీ నరసింహుని బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రోజు రథోత్సవం కన్నుల పండుగగా అనంతరం అర్చకులు చక్రస్నానం స్వామివారికి ఏకాంత సేవ పవళింపు సేవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు భక్తి పారవశ్యంతో లక్ష్మీ నరసింహ గోవిందా అనే నామం ఈ ప్రాంతమంతా మారుమోగింది స్వామివారికి ప్రత్యేక మొక్కలు తీర్చుకున్నారు. ఉదయం నుండి ప్రాబోదిగా, విశ్వక్సేన వీధి, ఛతు: స్థానార్చన: యశ: సోమకాల హోమం, రథబలి, రథోత్సవం పుష్పయాగం, ఏకాంతసేవ, గ్రామ బలి, కర్తలకు మంగళాశాసనం తీర్థప్రసాద వితరణ ఉబయ వేదాంత సూర్య పంచాంగ కర్త శ్రీ జగన్నాథం విష్ణువర్ధనాఆచార్యులు సింహాచలం మురళీధర్ ఆచార్య, స్థానాచార్యులు తిరునాహరి శ్రీనివాసాచార్య, ఆలయ అర్చకులు జగన్నాథం శ్రీనివాసాచార్య, జగన్నాథం నరసింహస్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం తరపున ఆలయ పాలకవర్గం మంత్రి కొప్పుల ఈశ్వర్ కు ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పూదరి రమేష్, కార్యదర్శి అల్లునూరి సతీష్, సర్పంచ్ మెరుగు కొమురయ్య, ఉప సర్పంచ్ పూదరి రాజేందర్, ఎం.పీ.టీ.సీ సప్ప జ్యోతి రాజు, ధర్మ కర్తలు దాసరపు రామచంద్రరావు, అన్నమనేని గజేంద్ర రావు, గౌరీ లక్ష్మీనారాయణ, మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కుమ్మరి వెంకటేష్, ఆలయ కమిటీ సభ్యులు నక్క హనుమాడ్లు, పులి ఎల్లయ్య దావన పెల్లి రమేష్ భోగి సాగర్, బావనపెల్లి హరీష్, పులి ప్రశాంత్, అలుగునూరి మల్లేష్, శ్రియఃజగన్నాథ వేదపాఠశాల వేదే విద్యార్థులచే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ కర్తలకు ప్రత్యేకంగా ఆశీర్వచనము అర్చకులు నిర్వహించారు.



## కొప్పుల ఈశ్వర్ తో హెూలీ వేడుకలు

### ధర్మపురి నియోజకవర్గ మార్కెట్ కమిటీ అధ్యక్షులు

వెల్గటూర్, మార్చి 29 (ప్రజాపాలన ప్రతినిధి) : వెల్గటూర్ మండలం వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు ఏలేటి కృష్ణ రెడ్డి సోమవారం రోజు కరీంనగర్ క్యాంపు కార్యాలయంలో ధర్మపురి నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ అధ్యక్షుల ఆధ్వర్యంలో తెలంగాణ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ తో హెూళి వేడుకల్లో పాల్గొన్నారు. సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ కు ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ లు అయ్యోరి రాజేష్, ఏలేటి క్రిష్ణ రెడ్డి, గుర్రం మోహన్ రెడ్డి, అజ్మీర తిరుపతి నాయక్, ముస్కు లింగాల రెడ్డి, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ లు సునిల్,లక్ష్మణ్, సత్యనారాయణ రెడ్డి, సహకార సంఘం అధ్యక్షులు ఛైర్మన్ భాస్కర్ రెడ్డి, పెగడపల్లి సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు రాజేశ్వర్ రావు, మాజీ ఎం.పీ.పీ గంగుల అశోక్ పాల్గొన్నారు.

## రైతు బీమా చెక్కును అందించిన తెలంగాణ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్



వెల్గటూర్ మార్చి 29 (ప్రజాపాలన ప్రతినిధి) : వెల్గటూర్ మండలం కొత్తపేట గ్రామానికి చెందిన అసాది శ్రీనివాస్ అనారోగ్యం తో మరణించగా వారికి రైతు భీమ ఇన్సూరెన్స్ ద్వారా మంజూరైన అయిన ఐదు లక్షల రూపాయల చెక్కును సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా భార్య లక్ష్మి కి అందించారు.ఈ కార్యక్రమంలో వెల్గటూర్ ఎం.పీ.పీ కునమల్ల లక్ష్మి లిగయ్య, కొత్త పేట మాజీ ఎం.పి.టి.సి కోడి గంగయ్య గారు పాల్గొన్నారు. ఆది శ్రీనివాస్ భార్య లక్ష్మి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

## వికారాబాద్ పట్టణంలో హెూళీ సంబరాలు



వికారాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 29 ( ప్రజా పాలన ): వికారాబాద్ పట్టణ పరిధిలోని ప్రజలు హెూలీ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గుంపులుగా చేరకుండా పోలీసుల ఆదేశాలను అనుసరిస్తూ భౌతిక దూరాన్ని పాటిస్తూ మాస్కులు ధరించి సంబరాలు జరుపుకున్నారు. పండుగ వాతావరణాన్ని కరోనా ప్రభావంతో తగ్గినప్పటికీ మిగతా ప్రజలందరూ ఘనంగా హెూలీ పండుగ నిర్వహించుకున్నారు. పట్టణ పరిధిలోని ప్రతి వీధిలో పిల్లలు పెద్దలు ఉషారుగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని కేరింతలతో హుషారుగా హెూలీ ఆడుకున్నారు. ప్రకృతి సిద్ధంగా తయారైన రంగులతో హెూలీ ఆడుకోవటంతో పర్యావరణానికి ఆరోగ్యానికి ఎలాంటి హాని చేయని రంగులతో హెూలీ సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. హెూలీ సంబరాలను సంతోషాల మధ్య జరుపుకోవడం విశేషం.

## స్ఫూర్తి రత్న అవార్డు దక్కించుకున్న జిలకర హైమ



మహబూబాబాద్ మార్చి 29 (ప్రజాపాలన ప్రతినిధి) : నెల్లికుదురు మండలంలోని రావిరాల గ్రామానికి చెందిన శ్రీనివాస భజన మండలి అధ్యక్షురాలు తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్ దక్కించుకున్నది, 100 మంది రైతు కుటుంబాలకు రెడ్ క్రాస్ చైర్మన్ విజయ్చందర్ కాజీపేట పట్టణంలోని బాలవికాస కేంద్రంలో శ్రీ సుధా సేవా సమితి అధ్యక్షురాలు మాధురి టీ.వీ అశోక్ కుమార్ పంతుల రమేష్ నిమ్మల శ్రీనివాస్ వనపర్తి పద్మావతి ప్రముఖ గాయకుడు ప్రణయ్ కుమార్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పద్మ పాల్గొన్నారు రైతు కుటుంబాలకు ఉగాది పురస్కారం ఇవ్వడం ఆనందదాయకమని తెలిపారు.

## హెూళీ రంగులు తమ జీవితాలలో వెలుగులు నింపాలి

### వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



వికారాబాద్ మార్చి 29, ప్రజాపాలన ప్రతినిధి:హెూళీ రంగులు తమ జీవితాలలో వెలుగులు నింపాలని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సబితా ఆనంద్ ఆస్పత్రి ఆవరణలో హెూలీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వికారాబాద్ నియోజకవర్గ ప్రజలందరూ ఇంటిల్లిపాది సుఖ సంతోషాలతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ ముత్యం రెడ్డి ఏఎంసి చైర్మన్ విజయ్ కుమార్, కౌన్సిలర్లు అనంత్ రెడ్డి, సురేష్, నవీన్ కుమార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మధిరలో ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



మధిర మార్చి 29, ప్రజాపాలన ప్రతినిధి:మధిరలో తెలుగుదేశం పార్టీ 40వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను టిడిపి రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి రామనాథం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ సెంటర్ నందిగామ సెంటర్, జీలుగు మాడు లలో పలు చోట్ల జెండా పండుగ కార్యక్రమాలు, కేక్ కటింగ్ ,ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు నివాళులు సమర్పణ టీడీపీ పతాకాల ఆవిష్కరణలు చేశారు . ఈ సందర్భంగా డాక్టర్ వాసిరెడ్డి రామారావు మాట్లాడుతూ 40 సంవత్సరాల్లో పార్టీలో అనేక ఒడిదుడుకులు ఏర్పడినప్పటికీ పార్టీ బలోపేతానికి కృషి చేసిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ జాతీయ పార్టీగా అవతరించనుందని తెలుగువారి ఆత్మగౌరవం దశదిశలా వ్యాప్తి చేసిన వ్యక్తి అన్న నందమూరి తారకరామారావు గారని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చేకూరి శేఖర్ బాబు వీరమాచినేని శ్రీనివాసరావు మల్లాది హనుమంతరావు,మార్నిడ్ పుల్లారావు, జగన్, రంగయ్య,1వ వార్డు కౌన్సిలర్ వగిడివల్లి విజయమ్మ, 16వ వార్డ్ కౌన్సిలర్ వంకాయలపాటి బాబు, కాశీ, వేల్పుల కొండ ,వర్మ ,రామకోటి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలి




వలిగొండ మార్చి 29, ప్రజాపాలన ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల సందర్భముగా ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య అన్నారు.సోమవారం మండల కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్లో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని,దేశంలో జాతీయ ఉపాధి హామీ పథకానికి 2 లక్షల కోట్లు కేటాయించి సంవత్సరానికి ప్రతి కుటుంబాన్ని 200 రోజుల పని కల్పించి రోజుకు 600 రూపాయల చొప్పున వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో కెసిఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 సంవత్సరాలు అయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని అన్ని హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు నాయకులు ఉప్పల ముత్యాలు,నలిగంజి వీరస్వామి,పోలేపాక యాదయ్య,వెంకటేశం, మహేష్,లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో హోళీ వేడుకల దృశ్యాలు



## వేసవి కాలంలో అందుబాటులోని వనరులతో చల్లని జాగ్రత్తలు.. చింతలేని ఆరోగ్యం

గొల్లపల్లి, మార్చి 29 (ప్రజాపాలన ప్రతినిధి):వేసవి మొదల్కెపోయింది. నిన్న మొన్నటి వరకూ హాయిగా తాకిన చల్లగాలులు క్రమంగా వేడి పుంజుకుంటున్నాయి. తరచూ పెదాలు ఎండిపోవడం, నాలుక తడారిపోవడం వాతావరణంలో వేడి పెరిగేకొద్దీ తీవ్రమౌతాయి. కేవలం మంచినీళ్లతో ఈ సమస్యను అధిగమించడం కష్టం. కానీ ఆ మంచినీటినే మరింత శక్తిమంతంగా తయారుచేసుకుంటే డీహైడ్రేషన్ సమస్యను సులభంగా అధిగమించవచ్చు. మరి అదెలా అంటారా..? ఇదిగో ఇలా..కొన్ని రకాల పండ్లు, కూరగాయలు, తులసి, పుదీనా లాంటి ప్రత్యేకమైన ఆకులు నీటిలో వేయడం వల్ల వాటిలోని యాంటీ ఆక్సిడెంట్‌లు, ఖనిజాలు నీటిని మరింత శక్తిమంతంగా తయారుచేస్తాయి. ఇవి డీహైడ్రేషన్ నుంచి కాపాడటమే కాకుండా శరీరంలోని మలినాలనూ తొలగిస్తాయి. అటువంటి రీహైడ్రేటింగ్ వాటర్ ఎలా తయారు చేసుకోవాలో తెలుసుకుందాం

**కీరా, నిమ్మకాయ ముక్కలు**

సన్నగా గుండ్రంగా తరిగిన కీరా ముక్కలు, నిమ్మకాయ ముక్కలు, కొన్ని పుదీనా లేదా తులసి ఆకులు నీటిలో వేయాలి. మంచినీటికి బదులుగా వీటిని తాగడం వల్ల డీహైడ్రేషన్ దరిచేరదు. అంతేకాదు నిమ్మకాయలోని ఎలక్ట్రోలైట్లు శరీరానికి శక్తినిచ్చి రోజంతా ఉత్సాహంగా ఉండడానికి తోడ్పడతాయి.

**వట్టివేరు**

గుప్పెడు వట్టి వేరును శుభ్రంచేసి, ఒక నెట్‌క్లాత్‌లో వదులుగా దిండులా కట్టి మంచినీటిలో వేయాలి. లేదా నేరుగా నీటిలో వేసి, వట్టి వేరు నీటి అడుగుకు చేరగానే పైన తేరిన నీటిని మంచినీళ్ల బదులుగా తాగితే శరీరంలోని వేడి తగ్గుతుంది. ఇది మంచి స్ట్రెస్ బస్టర్‌గానూ ఉపయోగపడుతుంది.



**పుచ్చకాయలు, కీరాముక్కల**

లీటరు నీటికి అర కప్పు చొప్పున పుచ్చకాయ ముక్కలని వేయాలి. వీలుంటే ఇందులో నాలుగు కీరా ముక్కలు, కొన్ని పుదీనా ఆకులు చేర్చాలి. మండే ఎండల్లో సైతం ఇది మీ శరీరాన్ని చల్లబరుస్తుంది.

**స్ట్రాబెర్రీ, నారింజ**

ముక్కలుగా చేసిన స్ట్రాబెర్రీ, గుండ్రంగా తరిగిన నారింజ నీళ్లలో వేసి మంచినీటికి బదులుగా తాగితే డీహైడ్రేషన్ తగ్గడమే కాకుండా శరీరానికి పుష్కలంగా సి విటమిన్ లభిస్తుంది. రక్తంలోని మలినాలు తొలగిపోయి చర్మం కాంతిమంతంగా తయారౌతుంది.

**గులాబీరేకులు**

గులాబీ రేకులను నీటిలో వేసి మంచి నీళ్లకు బదులుగా వీటిని తాగితే శరీరంలోని అధిక వేడిమి అదుపులోకి వస్తుంది. ఒత్తిడి తగ్గుతుంది. ఇలా రోజుకో కొత్త రీహైడ్రేటింగ్ వాటర్‌ని తయారు చేసుకుని ఈ వేసవిని చల్లగా గడిపేయండి మరి..!

## కొబ్బరి నీళ్లతో ఆరోగ్యమస్తు

రోజువారీ ఆహారంలో కొబ్బరి నీళ్లను కూడా చేర్చడం వల్ల ఎన్నో ఆరోగ్య సమస్యల నుంచి దూరంగా ఉండవచ్చంటున్నారు వైద్య నిపుణులు. వాటిల్లో ముఖ్యమైన ప్రయోజనాలివి...

అధిక బరువు

ఇందులో ఉండే బయోయాక్టివ్ ఎంజైమ్స్ జీవ, జీర్ణక్రియలను మెరుగుపరచడానికి తోడ్పడతాయి. తద్వారా బరువు తగ్గే ప్రక్రియ వేగవంతమవుతుంది.

ఎసిడిటీ

కొబ్బరి నీళ్లలోని బయోయాక్టివ్ ఎంజైమ్స్‌తో పాటు అధికమొత్తంలో లభ్యమయ్యే ఫైబర్... పేగుల కదలికను నియంత్రిస్తుంది. ఎసిడిటీ, అజీర్ణం, ఇతర పేగు సంబంధిత సమస్యలను దూరంగా ఉంచుతుంది.

డీహైడ్రేషన్

శరీరంలో ఎలక్ట్రోలైట్స్‌ను తిరిగి నింపడంలో కొబ్బరినీళ్లు ఎంతో ఉపకరిస్తాయి. తద్వారా శరీరానికి అవసరమైన నీటిని అదించి, డీహైడ్రేషన్‌కు గురి కాకుండా రక్షిస్తాయి.

బీపీ

రోజూ కొబ్బరి నీళ్లు తాగడం వల్ల హైపర్‌టెన్షన్ నియంత్రణలో ఉంటుందన్నది ఓ పరిశోధన సారాంశం. కొబ్బరి నీరు రక్త పోటును సరైన స్థాయిల్లో ఉంచడానికి దోహదపడుతుంది.

డీటాక్సిఫికేషన్

కొబ్బరి నీళ్లలోని యాంటీ ఆక్సిడెంట్స్ శరీరంలోని విష పదార్థాలను బయటకు పంపించి, కడుపులో మంటను తగ్గిస్తాయి.



## చర్మం భద్రం!

చర్మ సమస్యలు తేలికగా వదిలిపోవు. వాటికి శాశ్వత పరిష్కారం హోమియో వైద్యంలో సాధ్యపడుతుంది.

హోమియో పనితీరు


శరీరం బలపడి వ్యాధితో పోరాడాలంటే వ్యాధినిరోధక వ్యవస్థను మరింత చైతన్యపరచాలి. ఈ సూత్రాన్ని ఆధారంగా చేసుకొనే హోమియో వైద్యం ప్రారంభంలో లక్షణాలు పెరుగుతాయి. ఎప్పుడైతే రోగనిరోధకవ్యవస్థ చర్మ సమస్య తీవ్రతను గ్రహించి అందుకు విరుగుడుగా చురుగ్గా పనిచేస్తుందో, ఆ వ్యాధి అంతే త్వరగా అదుపులోకి రావడంతో పాటు భవిష్యత్తులో తిరగబెట్టదు.

చర్మ సమస్యలకు

రస్ టాక్సికోడెండ్రాన్: చర్మం మీద దురద, దద్దుర్లకు కారణమయ్యే పాయిుయిజన్ ఐవీ ఈ మొక్క పలు రకాల చర్మ సమస్యలకు చక్కని పరిష్కారం. కీళ్ల నొప్పులకు కూడా దివ్యౌషధంలా పనిచేసే ఈ మొక్క హెర్పిస్, తామర, డెర్మటైటిస్‌తో పాటు పలు రకాల చర్మ సమస్యల లక్షణాలైన దురద, మంట, నొప్పుల నుంచి ఉపశమనం ఇస్తుంది.

గ్రాఫైట్స్: జర్మనీ వైద్యుడు శామ్యూల్ హానిమన్ ఇతర చర్మ సమస్యలతో కూడిన చికిత్సలో దీన్ని మొదటగా ఉపయోగించారు. తామరలో తలెత్తే పొడిబారి, పొట్టు రేగే చర్మం సమస్యలకు, గాయం లేదా శస్త్రచికిత్స తరువాత మందబడే చర్మ సమస్యలకు ఈ మందును వాడతారు.

హెపర్ సల్ఫ్యూరిస్: గాయాలు మానడం అలస్యమవుతున్నా, పొట్టుతో కూడిన తామర ఉన్నా హెపర్ సల్ఫ్యూరిస్ వాడొచ్చు. ఆల్చిప్పల లోపలి పొరల్లోని క్యాల్షియం, సల్ఫర్ పువ్వుల బూడిదలను కలిపి వాడే ఈ ఔషధంతో తామర వ్యాధిలో తలెత్తే చర్మ పగుళ్లు, మొటిమలను తగ్గించవచ్చు. అలాగే స్టెఫలోకోకస్ అరస్ అనే బ్యాక్టీరియాను ఈ మందు అడ్డుకుంటుంది.



నేత్రం మురియాటికం: ఇందులో ఉండే ప్రధాన మూలకం సోడియం. దీంతో 'యాక్నం వల్గారిస్' అనే మొటిమల సమస్యకు, హెర్పిస్, తామరలో కనిపించే బొబ్బలు, సూర్యరశ్మి కారణంగా చర్మం కందిపోయే ఎలర్జీలకు చికిత్స చేయవచ్చు.

తుజ ఆక్సిడెంటాలిస్: ఇంటి అలంకరణ మొక్క ఇది. దీని నుంచి తయారుచేసే మందును హోమియోపతి వైద్యంలో మదర్ టింక్చర్‌గా ఉపయోగిస్తారు. హ్యూమన్ పాపిలోమా వైరస్‌తో తలెత్తే పులిపిర్లకు కూడా ఈ చికిత్స ఫలితాన్నిస్తుంది.

మెజీరియం: మోజీరియన్ అనే పొద బెరడు నుంచి తయారైన ఈ మందుతో తలనొప్పి, పంటినొప్పులను తగ్గించవచ్చు. పసిపిల్లల్లో కనిపించే 'క్రస్టాలాక్టియా' (చెవుల వెనక, తల వెంట్రుకల కుదుళ్లు, కళ్ల చుట్టూ చర్మం జిడ్డుగా రాలే సమస్య) అనే చర్మసమస్యను కూడా తగ్గించవచ్చు.

ఆర్సీనియం అల్బం: ఆర్సీనియం ట్రయాక్సైడ్‌ను పలుచన చేస్తే తయారయ్యే ఈ మందును ఆర్సినిక్‌కు విరుగుడుగా వాడతారు. ఆర్సినిక్ శరీరంలో చేరడంతో తలెత్తే హైపర్‌టెన్షన్, ఆర్సీనియల్ కెరటోసిస్, ఆర్సినిక్ వల్ల వచ్చే కేన్సర్‌కు చికిత్స చేయవచ్చు.

నైట్రికం ఆసిడం: పులిపిర్లు, చర్మ గాయాల చికిత్సకు ఇది అద్భుతమైన మందు. పగుళ్లు, గాయాలు, రసి కారుతూ ఉండే పుండ్లు వంటి సమస్యలకు చికిత్స చేయవచ్చు.

సెపియా అఫిషనాలిస్: ఒకరకం సముద్ర జీవి విడుదల చేసే ఇంకు నుంచి ఈ మందు తయారవుతుంది. ఈ ఔషధాన్ని మహిళల్లో ప్రసవానంతరం కనిపించే మానసిక కుంగుబాటు, మెనోపాజ్ దశలోని మహిళల సమస్యలకు ఉపయోగిస్తారు. నొప్పితో కూడిన చర్మసమస్యలు, కంటి కురుపులు, వెరికోజ్ వెయిన్స్‌లకు కూడా ఈ మందు పనిచేస్తుంది.

రానన్‌క్యులస్ బల్బోనస్: పసుపు పచ్చ రంగులో ఉండే ఈ మొక్క పువ్వులు విషపూరితమైనవి. హోమియో వైద్యంలో ఈ పువ్వులను కండర కణజాలం, చర్మ సంబంధ సమస్యలకు ఉపయోగిస్తారు. తామర, హెర్పిస్, వేళ్ల అంచులు చిట్లే ససమ్య, దురదలకు ఈ మందు పనిచేస్తుంది.

ఓలియాండర్: యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఈ ఔష?ధం చర్మ కణాలకు ఆక్సిడేషన్ బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్‌ల నుంచి రక్షణనిస్తుంది. సొరియాసిస్, చుండ్రు, హెర్పిస్‌ల చికిత్సలో వాడతారు.

# బాలయ్యను ఢీకొట్టబోతున్నది అతనే!



నందమూరి ఫ్యాన్స్ బీబీ-3 కోసం ఎంతగా వెయిట్ చేస్తున్నారో వాళ్లకు మాత్రమే తెలుసు. కానీ.. ఇప్పటి వరకూ టైటిల్ అనౌన్స్ చేయకుండా.. వాళ్లను ఊరిస్తూనే ఉన్నాడు దర్శకుడు బోయపాటి. ఆఖరికి రిలీజ్ డేట్ కూడా ఏనాడో ప్రకటించినప్పటికీ.. పేరు మాత్రం రివీల్ చేయడం లేదు. ఈ మోస్ట్ అవైటెడ్ సినిమా టైటిల్ ను మహా శివరాత్రి సందర్భంగా ప్రకటిస్తారనే ప్రచారం సాగింది. కానీ.. శివరాత్రి దాటిపోయి చాలా రోజులు అయినప్పటికీ.. ఇంకా టైటిల్ మాత్రం ప్రకటించలేదు. అయితే.. లేటెస్ట్ అప్డేట్ ప్రకారం.. ఉగాదికి ఈ సినిమా టైటిల్ ను అనౌన్స్ చేస్తారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. ఈ చిత్రానికి సంబంధించిన మరో సమస్య చాలా కాలంగా పెండింగ్ లో ఉంది. అదే.. మెయిన్ విలన్ సెలక్షన్. బీబీ-3లో చాలామంది విలన్ల్ల ఉన్నారని సమాచారం. వారిలో పలువురిని సెలక్ట్ చేసినప్పటికీ.. మెయిన్ విలన్ ఎవరన్నది మాత్రం కన్ఫాం కాలేదు. పలువురిని అప్రోచ్ అయినప్పటికీ.. కుదర్లేదు. దీంతో.. చివరకు కోలీవుడ్ స్టార్ శరత్ కుమార్ ను ఫైనల్ చేసినట్టు సమాచారం. గతంలో బోయపాటి సినిమాలో నటించారు శరత్ కుమార్. ఆ సాన్నిహిత్యంతోనే విలన్ పాత్రకు ఓకే చెప్పారని తెలుస్తోంది. బాలకృష్ణ-బోయపాటి శ్రీను కాంబి నేషన్లో రాబోతున్న మూడో చిత్ర మిది. ఇప్పటి వరకూ వచ్చిన సింహా లెజెండ్ బ్లాక్ బస్టర్ హిట్ గా నిలవడంతో ఈ చిత్రంపై అభిమా నులో భారీ అంచనాలు నెలకొన్నా యి. ద్వారకా క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి.. థమన్ సంగీతం అందిస్తున్నారు. సమ్మర్ లో స్లాట్ బుక్ చేసిన ఈ చిత్రాన్ని మే 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

# సినిమా స్కోప్

## రవితేజ సరసన మరోసారి.. నిజమేనా ?



మాస్ మహరాజా రవితేజ నక్కిన త్రినాధరావు దర్శకత్వంలో ఓ ఫుల్ కామెడీ ఎంటర్ టైనర్ చేస్తున్న సంగతి తెలిసిందే. కాగా ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్స్ నటించబోతున్నారట. వారిలో ఒక హీరోయిన్ గా రాశి ఖన్నాను ఫైనల్ చేశారని సమాచారం. ఇప్పటికే బెంగాల్ టైగర్ సినిమాలో రవితేజతో రాశి ఖన్నా కలిసి నటించింది. ఇప్పుడు మరోసారి రవితేజతో రాశి ఆడిపాడనుంది. ఇక ఈ సినిమాలో రవితేజ క్యారెక్టరైజేషన్ మంచి కామెడీ టైమింగ్ తో ఉంటుందని తెలుస్తోంది. ఎలాగూ త్రినాధరావ్ నక్కిన కామెడీని బాగా హ్యాండిల్ చేస్తాడు. ఆయన గత చిత్రాలు కూడా 'సినిమా చూపిస్తా మామ' 'నేను లోకల్ వంటి సినిమాలు మంచి ఎంటర్టైమెంట్ తో సాగిన విషయం తెలిసిందే. అదేవిధంగా రవితేజ కామెడీ టైమింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కేవలం తన మాడ్యులేషన్ తోనే అద్భుతమైన కామెడీని పండించగలడు. మరి రవితేజ %-- % త్రినాథరావ్ కలయికలో ఎలాంటి కామెడీ వస్తోందో చూడాలి.

# ప్రభాస్.. దీపికా మూవీ ఇంట్రెస్టింగ్ అప్డేట్




యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుసగా పాన్ ఇండియా సినిమాలు చేస్తూ బిజీ బిజీగా ఉన్నాడు. ప్రభాస్ ప్రస్తుతం చేస్తున్న ఆదిపురుష్ మరియు సలార్ సినిమాల కంటే ముందే ప్రకటించిన నాగ్ అశ్విన్ మూవీ మాత్రం ఇంకా ప్రారంభం కాలేదు. అద్భుతమైన సోషియో ఫాంటసీ కథతో వైజయంతి బ్యానర్ లో రూపొందబోతున్న ఈ సినిమా షూటింగ్ ను జులై లో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభాస్ మరియు బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకునే జంటగా అమితాబ్ ముఖ్య పాత్రలో నటించబోతున్న ఈ సినిమా లోని మెజార్టీ షూటింగ్ ను రామోజీ ఫిల్మ్ సిటీ లో నిర్వహించబోతున్నారట. భారీ ఖర్చుతో ఫిల్మ్ సిటీలో సెట్టింగ్ లు వెయిస్తున్నారు. ఇప్పటికే ఆ పని జరుగుతున్నట్లుగా సమాచారం అందుతోంది. విజువల్ వండర్ గా సినిమా ను తీర్చి సిద్ధేందుకు గాను మహానటి దర్శకుడు నాగ్ అశ్విన్ హాలీవుడ్ టెక్నీషియన్స్ ను రప్పిస్తున్నాడట. వచ్చే ఏడాది చివరి వరకు ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి అంటున్నారు.

# రకుల్.. మంచు లక్ష్మి 'ఫిట్నెస్' హెూలీ



టాలీవుడ్ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్.. మంచు లక్ష్మీ.. తాప్సి మరికొందరు మంచి స్నేహితులు. వీరికి ఫిట్నెస్ పై ఉన్న శ్రద్ధ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఎన్నో ఫిట్నెస్ కార్యక్రమాల్లో పాల్గొంటూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్న వీరు తాజాగా మరో విషయంలో అందరికి ఆదర్శంగా నిలిచారు. హెూలీని ఆరోగ్యవంతంగా జరుపుకునేందుకు వీరు చేసిన ప్రయత్నం సోషల్ మీడియా లో అభినందనలు పొందుతోంది. ఇలాంటి సమయంలో మీరు చేసిన పని నిజంగా అభినందనీయం అంటూ ప్రముఖులు కూడా అభినందిస్తున్నారు. హెూలీని ప్రత్యేకంగా జరుపుకునేందుకు చాలా ప్లాన్ చేశాం. కానీ కరోన మళ్ళీ పెరిగిన కారణంగా కొత్తగా హెూలీ జరుపుకోవాలని భావించాం. అందుకే తెల్లవారుజామున 4 గంటలకే ట్రెక్కింగ్ కు వచ్చాము. ఆ సమయంలో చంద్రుడు మరియు ఉదయించే సూర్యుడిని కూడా చూశామంటూ మంచు లక్ష్మి మరియు రకుల్ లు చెప్పుకొచ్చారు. వీరిద్దరితో పాటు మరి కొందరు కూడా హెూలీని ఇలా హెల్దీ గా మార్చుకునేందుకు ప్రయత్నించారు. కరోన మహమ్మారి నుండి దూరం ఉండాలంటే ఈ ఒక్క ఏడాదికి ఇలా మీరు కానిచ్చేయండి.

# వకీల్ సాబ్ పై ఆ నలుగురు ప్రభావం ఎంత?




పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటించిన వకీల్ సాబ్‌కి ఇప్పటివరకూ ప్రచారం పరంగా ఆశించినంత హైప్ లేదు. అయితే దీనిని అధిగమించేందుకు ప్రీరిలీజ్ వేడుకలు ట్రైలర్ వేడుకలు అంటూ హంగామా సృష్టించనున్నారు. ఇకపోతే తెలుగు రాష్ట్రాలు విదేశాల్లో బెనిఫిట్ షోలు.. స్పెషల్ షోల పేరుతో భారీ వసూళ్లు సాధించాలని టార్గెట్ చేశారు. అయితే వకీల్ సాబ్ కి వేరే హీరోలు వారి నటించిన సినిమాల నుంచి పోటీ ఉండదా? అంటే.. వివరాల్లోకి వెళ్లాలి. వకీల్ సాబ్ తో పాటు పలు చిత్రాలు ఏప్రిల్ మొదటి వారంలో రిలీజ్ క్యూలో ఉన్నాయి. ఇప్పటికే గోపిచంద్ నటించిన సీటీమార్ రిలీజ్ వాయిదా పడింది. ఏప్రిల్ తొలి వారంలోనే ఈ సినిమా విడుదలవుతుందని అంచనా. కింగ్ నాగార్జున నటించిన వైల్డ్ డాగ్ ఏప్రిల్ 2న విడుదలవుతోంది. అలాగే డబ్బింగ్ చిత్రాలు యువరత్న- సుల్తాన్ కూడా ఏప్రిల్ తొలి వారంలోనే రిలీజవుతున్నాయి. నాని టక్ జగదీష్ వకీల్ సాబ్ రిలీజైన రెండు వారాల వరకూ థియేటర్లలోకి రాదు. పవన్ తో పాటు నాగార్జున.. గోపిచంద్ సినిమాలు థియేటర్లలో ఉంటాయి. కానీ పవన్ క్రేజు ముందు ఇంకేవీ నిలబడవు అన్నది తెలిసిన వ్యవహారమే. అలాగే వకీల్ సాబ్ కి లాంగ్ వీకెండ్ అదనపు ప్రయోజనం. వైల్డ్ డాగ్ రిలీజై వారం పాటు ఆడాకే వకీల్ సాబ్ వస్తోంది కాబట్టి ఆ మేరకు వసూళ్ల షేరింగ్ సమస్య లేదు. సుల్తాన్ డబ్బింగ్ చిత్రం .ఇది వకీల్ సాబ్ పై ఎలాంటి ప్రభావం చూపదు. ఆ విధంగా వకీల్ సాబ్ కు అంతా కలిసొచ్చే పరిణామాలే కనిపిస్తున్నాయి. భారీగా టిక్కెట్లు రేట్లు పెంచి బెనిఫిట్ షోలు స్పెషల్ ప్రీమియర్లకు పెద్ద రేటుతో టిక్కెట్టు ధరలు నిర్ణయించారు కాబట్టి అదంతా కలిసొచ్చేదే. తొలి వీకెండ్ రికార్డులు నమోదయ్యే అవకాశం ఉందని పవన్ అభిమానులు అంచనా వేస్తున్నారు.

# తమన్నా '11త్ అవర్' వెబ్ సిరీస్ టీజర్..!




కరోనా లాక్ డౌన్ సమయంలో ఓటీటీల సందడి ఎక్కువ అవడంతో స్టార్ హీరోహీరోయిన్లు సైతం వెబ్ సిరీస్ లలో నటించడానికి ముందుకొచ్చారు. స్టార్ హీరోయిన్ మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా కూడా డిస్నీ ప్లస్ హాట్ స్టార్ కోసం 'నవంబర్ స్టోరీస్' అనే సిరీస్ లో నటించింది. ఈ క్రమంలో తెలుగు ఓటీటీ ఫ్లాట్ ఫార్మ్ 'ఆహా' కోసం "11త్ అవర్" అనే వెబ్ సిరీస్ చేసింది. నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ ప్రవీణ్ సత్తారు ఈ సిరీస్ ని రూపొందించాడు. తాజాగా '11త్ అవర్' టీజర్ ను యూనిట్ సభ్యులు విడుదల చేశారు. తమన్నా ఈ సిరీస్ లో కార్పొరేట్ కంపెనీని ని నడిపే అరాత్రికా రెడ్డి అనే అమ్మాయిగా కనిపిస్తోంది. అయితే కుటుంబ సభ్యులు - స్నేహితులు - శత్రువులు ఆమె ఆ కంపెనీని నిర్వహించలేదనే భావనతో ఉన్నట్లు టీజర్ చూస్తే అర్థం అవుతోంది. పురుషాధిక్యత ఉన్న రంగంలోకి దిగిన యువతి.. ఆ పోటీని శత్రువులను తట్టుకొని ఎలా పోరాడి నిలబడింది అనేది ఈ కథ. 'చక్రవ్యూహంలో చిక్కుకున్నప్పుడు దారి వెతికితే దొరకదు.. క్రియేట్ చేయాల్సి వస్తుంది' అని డైలాగ్ '11త్ అవర్' నేపథ్యాన్ని తెలియజేస్తోంది. ఈ కార్పొరేట్ డ్రామాలో తమన్నా రిజర్వ్డ్ గా ఉండే పాత్రలో అలరించనుందని తెలుస్తోంది. ఈ ఒరిజినల్ సిరీస్ లో అరుణ్ ఆదిత్ - వంశీ కృష్ణ - రోషిణి ప్రకాష్ - జయప్రకాష్ - శత్రు - మధుసూదన్ రావు - పవిత్ర లోకేష్ - అనిరుధ్ బాలాజీ - శ్రీకాంత్ అయ్యంగార్ - వినయ్ - ప్రియా బెనర్జీ తదితరులు ఇతర పాత్రలు పోషించారు. ప్రదీప్ ఉప్పలపాటి ప్రొడ్యూసర్ గా వ్యవహరించారు. "11త్ అవర్" సిరీస్ 'ఆహా' యాప్ లో ఏప్రిల్ 9 నుంచి స్ట్రీమింగ్ కానుంది.

మాస్టర్ కీ TV
(అంబేడ్కర్ TV)
TV MASTER KEY NEWS FOR EQUALITY
జై భీం,
మీరు నాయకుడిగా ఎదగాలని అనుకుంటున్నారా...?
మీరనుకున్న వార్తలు రావాలని కోరుకుంటున్నారా...?
పెట్టుబడి లేకుండా ఆదాయం పొందాలని అనుకుంటున్నారా...?
మీరూ మీ అసెంబ్లీ నియోజకవర్గం లో
టీవీ ఛానల్ ఓనర్ గా కావాలని అనుకుంటున్నారా...?
అయితే రండి, కదలి రండీ
బహుజనాభివృద్దే.. దేశాభివృద్ధి అని నిరూపిద్దాం
1. ఈ దేశంలో ఉన్న ఫోర్త్ ఎస్టేట్ (మీడియా రంగం) బహుజనుల సమస్యల మీద ప్రచారం చేయడం లేదని మీ అందరికీ తెలుసు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా విలేఖరులకు సామాజిక కార్యకర్తలకు, అంబేడ్కర్, పూలే సంఘం నాయకులకు, కనీసం 100 మంది తెలిసిన గ్రూపునాయకులకు టీవీ ఛానల్ ప్రతినిధిగా / యజమానిగా అవకాశం ఇవ్వబడును.
2. జీవిత కాలంలో ఆయా అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతినిధిగా / యజమానిగా నియమించబడును.
3. ఆయా ప్రతినిధికి ప్రకటనల ఆదాయం (Advertising Revenue)లో ప్రకటనలపై 40% ఆదాయం ఇవ్వబడును.
4. వార్తలను స్వేచ్ఛాయతంగా ప్రసారం (Telecast) చేసే వీలు కల్పించబడును.
సంప్రదించండి
Tel No: 9849031420 ,9440918143, 94409 18371, 94400 53858, 93473 50692,8008840506, 9440077239, 7798832998, 76600 27678,
Office: Ambedkar TV Channel, 3rd Floor, Dault Plaza, Main Road, Besides Bata Showroom, Lakdi ka pool, Hyderabad - 500004
E- mail : ambedkartvchannel2018@gmail.com www.ambedkartv.org

Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989